

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
కర్నూలు నంద్యాల
మంగళవారం | 17 జూన్ 2025
పేజీలు 8


# ప్రభుత్వం పై ప్రజల్లో అసంతృప్తి


వైకాపా కర్నూలు జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్‌రెడ్డి

- వైకాపా నిరసన కార్యక్రమాలకు అనూహ్య స్పందన
- కక్షపూరితంగా వ్యవహరిస్తోన్న ప్రభుత్వ పెద్దలు
- సూపర్ సిక్స్ హామీలను అమలు చేయలేక చేతులెత్తేసారు
- ఒక్క పరిశ్రమకైనా కనీసం భూమి పూజ చేసారా..?
- వైకాపా కర్నూలు జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్‌రెడ్డి

**కర్నూలు, మేజర్‌న్యూస్‌బ్యూరో :** ఏడాది కాలంలోనే రాష్ట్రంలోని ఎన్డీఏ కూటమిపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని వైకాపా కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. ఆరు నెలల కాలంలో వైకాపా నిర్వహించిన పలు నిరసన కార్యక్రమాలకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరు అవుతున్న తీరు దీనికి అద్దం పడుతోందని ఆయన చెప్పారు. సోమవారం తనను కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడారు. ఫీజు రీఇంబర్స్‌మెంట్, రైతు సమస్యలు, విద్యుత్ ధరల పెంపుపై నిరసన కార్యక్రమాలకు వైకాపా పిలుపుకు ప్రజలు పెద్ద ఎత్తున స్పందించారని, ఇటీవల నిర్వహించిన వెన్నుపోటు కార్యక్రమానికీ వేల సంఖ్యలో హాజరయ్యారని ఆయన గుర్తు చేశారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైసీపీ అధికారంలోకి రావడం ఖాయమన్న ఉత్సాహం పార్టీ కేడర్‌లో కనిపిస్తోందని ఆయన అన్నారు.

రాష్ట్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోతోందని, అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా సూపర్‌సిక్స్ హామీలను నిలబెట్టుకోలేకపోయిందని ఆయన విమర్శించారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా అవినీతి కార్యక్రమాలు పెరిగిపోయాయని, చివరకు పేదలకు పంచే బియ్యాన్ని బొక్కేందుకు తెదేపా ఎమ్మెల్యేలు కక్కుర్తి పడుతున్నారని ఆయన విమర్శించారు. రాష్ట్ర విభజన తర్వాత పేదల బియ్యాన్ని సొమ్ము చేసుకుంటున్న ఎమ్మెల్యేలను తొలిసారి చూస్తున్నామని ఆయన అన్నారు. మళ్లీ ఎన్నికలు వచ్చేలోగా 20లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యమంటున్న ఈ ప్రభుత్వం ఏడాది కాలంలో కనీసం ఒక్క పరిశ్రమకైనా భూమి పూజ చేసిందా చెప్పాలని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో కర్నూలు జిల్లా ఓర్వకల్లు వద్ద గ్రీన్‌కో నిర్మాణానికి భూమి పూజ మిగతా 2లో

# రాఘవేంద్ర స్వామి సన్నిధిలో కేంద్ర మంత్రి

- మంత్రికి ఘనంగా స్వాగతం పలికిన మఠం సిబ్బంది
- కేంద్ర మంత్రిని కలిసిన కర్నూలు జిల్లా కలెక్టర్,ఎస్పీ

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కేంద్ర మంత్రి ప్రహల్లాద జోషి మంత్రాలయంకు విచ్చేశారు. ఆయనకు శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం సిబ్బంది ఘనస్వాగతం పలికారు.ఆయన ముందుగా గ్రామ దేవత మాంచాలమ్మను దర్శించుకున్నారు. అనంతరం శ్రీ రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని పూజలు చేశారు. అక్కడ జరుగుతున్న పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మిగతా 2లో


రాఘవేంద్రస్వామి మఠం ప్రాంగణంలో కేంద్రమంత్రి

# పాచి నీరే.. త్రాగునీరాయే..!!


ప్రజలకు సరఫరా అవుతున్న పాచిపట్టిన నీటి దృశ్యం

- పెసలబండా రక్షిత మంచినీటి పథకం ద్వారా 24 గ్రామాలకు త్రాగునీరు సరఫరా
- శుభ్రం చేయని మంచినీటి ట్యాంకులు.. పట్టించుకోని ఆర్ డబ్ల్యూఎస్ అధికారులు..
- ఫిల్టర్ బెడ్లలో పేరుకుపోతున్న పూడిక,పాచి
- ఫిల్టర్ చేయకుండా త్రాగునీటిని సరఫరా చేస్తున్న స్కీం సిబ్బంది..
- అధికారుల నిర్లక్ష్యం.. సరఫరా అవుతున్న శుద్ధి చేయని త్రాగునీరు..
- రోగాలతో బెంబేలెత్తున్న వివిధ గ్రామాల ప్రజలు ..

**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** త్రాగు నీటిని శుద్ధి చేయకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రజలకు సరఫరా చేయడంతో రోగాలపాలవుతున్నామని మండల పరిధిలోని గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు యొక్క దాహార్తిని తీర్చేందుకుగాను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు లక్షలాది రూపాయలు వెచ్చించి గ్రామీణా ప్రాంతాలలో రక్షిత మంచినీటి పథకాలు ఏర్పాటు చేసి ప్రారంభిస్తే.. ఈ రక్షిత మంచినీటి పథకాలు అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అవి కాస్తనీరుగారి పోతున్నాయి. ముఖ్యంగా పెద్దకడుబూరు మండల పరిధిలోని నౌలకల్ గ్రామానికి సమీపంలో ఏర్పాటు చేసిన పెసలబండా రక్షిత మంచినీటి పథకం క్రింద 24 గ్రాములు ఉన్నాయి. అందులో ఆదోని మండల పరిధిలోని 17 గ్రామాలు, మిగతా 2లో

## యోగా చేయండి.. శారీరక,మానసిక ఆరోగ్యాన్ని పొందండి

- రాష్ట్ర న్యాయ,మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి.ఫరూక్
- టెక్కె మార్కెట్ యార్డు ప్రాంగణంలో 5200 మందిచే యోగాభ్యాసనాలు

6లో


యోగా చేస్తున్న కలెక్టర్, అధికారులు, తదితరులు

## అర్జీల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి సారించాలి

- కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా
- పిజిఆర్ఎస్‌లో ప్రజల నుండి వినతులు స్వీకరించిన కలెక్టర్


2లో
అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, జెసి

# ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి

(మొదటి పేజి తరువాయి)

చేసిన జగన్మోహన్‌రెడ్డి తాను అధికారంలో ఉండగానే ఒక ప్లాంట్‌ను కూడా ప్రారంభించారని, జైరాజ్ ఇస్పాత్ పరిశ్రమకు కూడా తమ ప్రభుత్వమే అనుమతులిచ్చిందని ఆయన చెప్పారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌కు నీటి సౌకర్యం కల్పించేందుకు పైపులైన్ నిర్మాణానికి అనుమతులిచ్చి నిధులు మంజూరు చేస్తే నందికొట్కూరు వద్ద కొంత భాగం పూర్తి కాకుండా తెదేపా నేతలు అడ్డుకుంటున్నారని ఎస్వీ మోహన్‌రెడ్డి ఆరోపించారు.

తల్లికి వందనం పథకాన్ని తొలి ఏడాది ఎత్తి వేశారని, ఇంట్లో ఎంత మంది విద్యార్థులుంటే అన్ని 15వేల రూపాయలు ఇస్తామన్న తెదేపా పెద్దలు ఇప్పుడు దాన్ని తుంగలో తొక్కినట్లు కనిపిస్తోందని ఆయన అన్నారు. చాలా మంది విద్యార్థులకు తల్లికి వందనం కింద సొమ్ములు బ్యాంకుల్లో డిపాజిట్ కాలేదని అంటున్నారని, మరి కొన్ని చోట్ల ఒకే ఇంట్లో 50 మంది 60 మంది విద్యార్థులున్నట్లు చూపించి నిధులు విడుదల చేసినట్లు తెలుస్తోందని, రానున్న రోజుల్లో ఈ పథకంలో ఏమి జరిగిందన్నది స్పష్టమవుతుందని ఆయన అన్నారు. ఇక సబ్సిడీపై ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామన్న హామీని తెదేపా నిలబెట్టుకోలేకపోయిందని, ఇప్పటి వరకు ఒక సిలిండర్ ఇచ్చిన ప్రభుత్వం మరో సిలిండర్ ఎప్పుడు ఇస్తారన్నది చెప్పడం లేదని ఆయన అన్నారు. 18 సంవత్సరాలు నిండిన మహిళలకు నెలకు 1500 రూపాయల ప్రకారం ఏడాదికి 18వేల రూపాయలు ఇస్తామని చెప్పిన హామీని తెదేపా మరచిపోయిందని ఆయన విమర్శించారు. నిరుద్యోగ భృతి ఏమయ్యిందని ఆయన ప్రశ్నించారు. 50 సంవత్సరాలు నిండిన ఎస్సీ, ఎస్టీ, బిసి మహిళలకు ఇస్తామన్న పెన్షన్ ఏమయ్యిందో చెప్పాలని తెదేపా నేతలను ఆయన డిమాండ్ చేశారు. ఉద్యోగులు కూడా అసంతృప్తితోనే ఉన్నారని ఆయన చెప్పారు. పీఆర్‌సి కోసం కమిషన్ వేసే పరిస్థితిలో ప్రభుత్వం లేదని, డిఏ, ఐఆర్ ఇచ్చే పరిస్థితి కూడా లేదని ఆయన అన్నారు. వైకాపా అధికారంలోకి వచ్చిన వెంటనే కరోనా లాంటి విపత్తులు ఎదురైనా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అన్ని సంక్షేమ పథకాలను జగన్మోహన్‌రెడ్డి అమలు చేశారని ఆయన గుర్తు చేశారు. తెదేపా ప్రభుత్వ పెద్దలు కక్ష్యపూరితంగా వ్యవహరిస్తున్నారని, ప్రతి ఒక్కరిని జైలుకు పంపించడమే లక్ష్యంగా పని చేస్తున్నారని ఆయన విమర్శించారు. సోషియల్ మీడియాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెడుతున్న వారందరినీ వైకాపా కార్యకర్తలుగా నిర్ణయిస్తూ వందలాది మందిపై ఏడాది కాలంలో కేసులు పెట్టి జైలుకు పంపించారని తెదేపా ప్రభుత్వంపై ఎస్వీ మోహన్‌రెడ్డి విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైకాపాను గద్దెనెక్కించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన చెప్పారు.

## రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన సాగుతోంది..డోన్ వైసీపీ నాయకులు

**డోన్ రూరల్ మేజర్ న్యూస్ :** మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అభివృద్ధి ,సంక్షేమం గాలికి వదిలేసి అక్రమ కేసులతో వైసిపి శ్రేణులను వేధిస్తూ రెడ్ బుక్ పాలన సాగిస్తోందని మాజీ రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు ,జడ్పిటిసి బద్దల రాజ్ కుమార్ ,డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ,పట్టణ వైసిపి అధ్యక్షుడు మల్లికార్జున రెడ్డి ,నంద్యాల జిల్లా వైసిపి వాలంటరీ విభాగ అధ్యక్షుడు పోస్ట్ ప్రసాద్ లు అన్నారు. సోమవారం పట్టణంలోని స్థానిక వైసిపి కార్యాలయంలో కూటమి ప్రభుత్వ ఏడాదిపాలన లోని వైఫల్యాలను తెలుపుతూ ప్రచురించిన పుస్తకాన్ని వైసీపీ శ్రేణులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాది కాలంలో వైసిపి ప్రభుత్వం అమలు చేసిన హామీలను కూటమి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఏడాది కాలంలో చేసిన 1,50,000 కోట్ల అప్పు దేనికి ఖర్చు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. గాంధీజీ కలల కన్న గ్రామ స్వరాజ్యం మాజీ సీఎం జగన్ నేతృత్వంలోని వైసిపి ప్రభుత్వంతోనే సాకారమైందని తెలిపారు . ఏడాది కాలంలో 90% హామీలను అమలు చేసిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందని స్పష్టం చేశారు .కూటమి ప్రభుత్వ అరాచక పాలనను ప్రశ్నిస్తున్న వారిపై కక్షపూరితంగా వ్యవహరిస్తూ డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతుందని ,నాటి బీహార్ ను తలపించేలా రాష్ట్రంలో పరిస్థితులు నెలకొన్నాయని ఆరోపించారు. ఏది ఏమైనప్పటికీ కూటమి ప్రభుత్వ ఏడాది పాలన పూర్తిగా విఫలం అని చెప్పుకొచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుస్సేన్, మండల వైసీపీ అధ్యక్షుడు సోమేశ్ యాదవ్ ,కౌన్సిలర్లు దినేష్ గౌడ్,ఆర్ట్ రమణ ,వైసిపి నాయకులు ఓబులాపురం మదన్ యాదవ్,దొరపల్లె చిరంజీవి,పాలుట్ల రఘురాం, లెక్చరర్ చంద్ర ,క్వాలిటీ అబ్దుల్లా,ఫారెస్ట్ మౌలాలి, సుంకన్న, పెయింటర్ వెంకటేష్, డీలర్ కృష్ణ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## మోడీ పాలనపై ఇంటింటి ప్రచారం

**పాములపాడు మేజర్ న్యూస్ :**

కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పథకాలపై ఆ పార్టీ నాయకులు రాష్ట్ర కౌన్సిలింగ్ సభ్యులు చెల్లా దామోదర్ రెడ్డి బిజెపి మండల అధ్యక్షుడు రాయపాటి మురళీమోహన్ గ్రామస్థాయి నాయకులతో కలిసి ప్రజలకు నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీ 11 సంవత్సరాల సుపరిపాలనలో దేశం ఎంతగానో అభివృద్ధి చెందిందని కొనియాడారు రైతులకు, చిన్నపాటి పరిశ్రమలు మరియు వ్యాపారాలకు ప్రత్యేక రుణాలు ఇచ్చి అభివృద్ధి వస్తుందని గుర్తు చేశారు ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ గోపాలయ్య చంద్రశేఖర్ రెడ్డి నాగ లింగయ్య బాలస్వామి ఆరోగ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.

## రాఘవేంద్ర స్వామి సన్నిధిలో కేంద్ర మంత్రి

(మొదటి పేజి తరువాయి)

ఈ కార్యక్రమంలో కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు, మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు, శ్రీనివాస్‌రావు, వెంకటేష్, ఐపి నరసింహాస్వామి, వ్యాసరాజ ఆచార్, సిఐ రామాంజులు, ఎస్.ఐ శివాంజులు, తహశీల్దార్ రవి, విఆర్‌ఓ భీమన్న గౌడ్, తదితరులు పాల్గొన్నారు.




కేంద్రమంతికి స్వాగతం పలుకుతున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ

**కేంద్రమంత్రిని కలిసిన జిల్లా కలెక్టర్, ఎస్పీ :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి దర్శనార్థం కేంద్ర మంత్రి ప్రహల్లాద జోషి మంత్రాలయంకు విచ్చేశారు. కేంద్రమంత్రిని కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్‌బాష,జిల్లాఎస్పీ విక్రాంత్‌పాటిల్ మర్యాదపూర్వకంగాకలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎమ్మిగనూరు డిఎస్పీ ఉపేంద్ర బాబు, మంత్రాలయం సిఐ రామానుజులు, తహశీల్దార్ రవి, ఎస్.ఐ శివాంజులు, పాల్గొన్నారు.

### అర్జీల పరిష్కారంపై

## ప్రత్యేక దృష్టి సారించాలి

**కర్నూలు, మేజర్‌న్యూస్ ప్రతినిధి :** అర్జీల పరిష్కారంలో నాణ్యత ఉండేలా చూసుకోవాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం పిజిఆర్‌ఎస్‌లో వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పిజిఆర్‌ఎస్‌కు సంబంధించి రీఓపెన్ కేసుల మీద ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పిజిఆర్‌ఎస్ లాగిన్‌లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలని, అర్జీలను ఎప్పటికప్పుడు పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. సిఎంఓ గ్రీవెన్స్‌లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ నెల 17న నగరంలో పారిశుద్ధ్య కార్మికులతో యోగా కార్యక్రమం నిర్వహణ థిమాటిక్ యోగా కార్యక్రమం ఔట్ డోర్ స్టేడియంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులతో పాటు సిబ్బంది కూడా హాజరు కావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమం విజయవంతం అయ్యేలా అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కమీషనర్ రవీంద్రబాబును ఆదేశించారు. ఈ నెల 21న జరిగే యోగా కార్యక్రమంలో 2కోట్ల మంది ప్రజలు పాల్గొననున్నారని ఇందులో భాగంగా జిల్లా నుండి దాదాపు 11లక్షల మంది పాల్గొనేలా రిజిస్ట్రేషన్ చేయించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా జిల్లా అంతటా అన్ని వేదికల్లో ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలన్నారు. ఆయా మండలాల్లో యోగా కార్యక్రమాలు విజయవంతం అయ్యేలా పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ స్పెషల్ ఆఫీసర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఓలను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ డా.బి నవ్య మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమాలను పకడ్బందీగా విజయవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. యోగాకు సంబంధించి నిర్వహించిన వివిధ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ డిఆర్‌ఓ వెంకటేశ్వర్లు, హౌసింగ్ పిడి చిరంజీవి, జిల్లా పరిషత్ సిఈఓ నాసరరెడ్డి, జిల్లా అధికారులు తదితనేలే పాల్గొన్నారు.

# పాచి నీరే.. త్రాగునీరాయే..!!

(మొదటి పేజి తరువాయి)

అలాగేపెద్దకడుబూరుమండలంలోని 7గ్రామాలు ఉన్నాయి. ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీటిని అందించేందుకుగాను జిల్లా గ్రామీణా నీటిసరఫరా విభాగం అధికారులు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుతో పాటు ఫిల్టర్ బెడ్ల పంపు హౌస్ వంటి వాటిని నిర్మించడం జరిగింది. అలాగే ఈ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు దాని ప్రక్కనే నాలుగు ఫిల్టర్ బెడ్లను కూడా నిర్మించి ఆ నీటిని శుద్ధి చేసి పంపుహౌస్ ద్వారాఇతర గ్రామాలకు తాగునీరు సరఫరా చేసేవారు. అయితే నీటిని సరఫరా చేసే ఆ ఫిల్టర్ బెడ్లలో రెండు మాత్రమే పనిచేస్తున్నాయ ని, మిగిలిన రెండు ఫిల్టర్ బెడ్లు పనిచేయడం లేదని తెలిపారు.అయితేఈ నాలుగు ఫిల్టర్‌బెడ్లలో గత కొన్ని సంవత్సరాలుగా నీటిని సరఫరా చేస్తూ..కనీసం ఫిల్టర్ బెడ్లను శుభ్రం చేయకపోవడంతో పాచి,పూడికపేరుకోనిపోయాయని,అయితే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తూ..పాచి,పూడిక పేరుకోనిపోయి నీళ్ళు దుర్వాసన వెదజల్లుతోన్న ఆ నీటినే నేరుగా పంపు హౌస్ ట్యాంకులోకి సరఫరా చేసి అక్కడ నుంచి నేరుగా సిబ్బంది ఇతర గ్రామాలకు సరఫరా చేస్తున్నారని, ఆ నీటిని త్రాగిన ప్రజలు రోగాలు బారిన పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని అయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.పాచి పట్టి పూడిక తీయక సరఫరా చేస్తుండడంతో మంచి నీళ్లు త్రాగాలంటే డబ్బులతో కొనుగోలు చేసి మినరల్ వాటర్‌తో తమ గొంతులను తడపకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వివిధ గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాచిపట్టి దుర్వా సన వెదజల్లుతున్న ఆ నీటిని త్రాగలేక, రోగాలబారిన పడలేక మంచినీటిని మినరల్ వాటర్ అమ్మే వారి వద్ద నుండి బిందె రూ.10 నుండి రూ.15 లకు కొనుగోలు చేసి త్రాగుతున్నామని తెలిపారు. మినరల్ వాటర్ త్రాగడం వల్ల మోకాళ్ల నొప్పులు,కీళ్ల నొప్పులు వస్తున్నా యని,ఏ నీటిని త్రాగిన రోగాలబారిన పడడం మాత్రం తప్పడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 24 గ్రామాలలో పాచి పట్టిన నీటిని ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది సరఫరా చేస్తున్న గ్రామాలకు నీటిని ఎలా సరఫరాచేస్తున్నారు.గ్రామాలలో పరిస్థితులు ఎలా ఉన్నాయి..అని పరిశీలించే తీరిక అధికారులకు లేదా అంటూ ప్రశ్నిస్తు న్నారు.సిబ్బంది పనితీరును పరిశీలించి వారి పై చర్యలు తీసుకోవాల్సిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నిమ్మకుని రెత్తినట్లు ఉండడతో సిబ్బంది ఇలా నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తున్నారని జిల్లా గ్రామీణా నీటి సరఫరా విభాగం అధికారులు స్పందించి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ఫిల్టర్ బెడ్లలో పేరుకొపోయిన పూడిక తోపాటు ఇసుకను తొలగించి ఫిల్టర్ బెడ్లలో కొత్త ఇసుకను వేసి శుద్ధి చేసిన నీటిని అయా గ్రామాల ప్రజలకు సరఫరా చేయాలని వివిధ గ్రామాల ప్రజలు ప్రజాప్రతినిధులు అధికారులను కోరుతున్నామన్నారు.



సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు



నీటి నిల్వ ట్యాంకు సంపు



పంపుహౌస్ రూం దృశ్యం

సూర్య www.suryaa.com



# అభివృద్ధిని చూసి ఓర్వలేక వెన్నుపోటంటూ నాటకాలు



మాట్లాడుతున్న తెదేపా నాయకులు

**కర్నూలు, మేజర్‌న్యూస్ ప్రతినిధి :** తెలుగుదేశం పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసిపి వారు వెన్నుపోటంటూ నాటకాలు ఆడుతున్నారని తెదేపా పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శి, డిసియంయస్ ఛైర్మన్ నాగేశ్వరరావు యాదవ్‌లు అన్నారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ కడప మహానాడుతో జగన్‌మోహన్‌రెడ్డి పిచ్చివాడిలా తిరుగుతూ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తుంటే వారితో పాటు వారి పార్టీ నాయకులు కూడా జగన్‌ను అనుసరిస్తున్నారన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఏనాడు కూడా జిల్లా అభివృద్ధి గురించి పట్టించుకోని నాయకులు నేడు తెదేపా హయాంలో అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందన్నారు. ఒకపక్క మంత్రి టీజీ భరత్ జిల్లాను అభివృద్ధిలోకి తీసుకొచ్చి నిరుద్యోగులైన యువతీ, యువకులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించుటలో భాగంగా ఓర్వకల్లును పారిశ్రామిక హబ్‌గా మార్చి పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తున్నారన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. అలాగే సీనియర్ మంత్రి యన్‌ఎండి ఫరూఖ్ మైనార్టీల అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. గతంలో తెదేపాలోకి వచ్చి కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేసుకుని లబ్ధిపొందిన విషయాన్ని విస్మరించి ఇప్పుడు వెన్నుపోటు అంటూ మాట్లాడడం వారికే చెల్లిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగేంద్ర కుమార్, తిరుపాల్‌బాబు, జేమ్స్, సత్రం రామక్రిష్ణుడు, అఖీల్, యల్‌వి ప్రసాద్, ఆనంద్, విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం..



పాలాభిషేకం చేస్తున్న నాయకులు

**దేవనకొండ మేజర్ న్యూస్ :** నాటికి నేటికీ రాష్ట్ర అభివృద్ధి మన ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని మండల టిడిపి నాయకులు బడిగింజల రంగన్న,నీలకంఠం గౌడ్. ఈదుల దేవరబండ సుభాన్ అన్నారు. సోమవారం మండల టిడిపి నాయకులతో కలిసి దేవనకొండ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణం నందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవణ్ కళ్యాన్,ఆలూరు టిడిపి ఇన్చార్జీ వీరభద్ర గౌడ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బారు మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వంలో కేవలం ఒక విధ్యార్థికే నిధులు ఇవ్వడం జరిగిందని అయితే మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇంట్లో ఎంతమంది ఉన్నా అందరికీ తల్లికి వందనం పేరుతో నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు. దీంతో వైకాపా నాయకులు చేస్తున్న బూటకపు ప్రచారంపై ప్రజలు మండి పడుతున్నారని కాబట్టి వైకాపా నాయకులు ఇకనైనా చంద్రబాబు నాయుడు చేస్తున్న అభివృద్ధికి సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెంకటస్వామి గౌడ్,మలకన్న,ఆకుల వీరేశ్,మల్లికార్జున,ఆకుల సిద్ధ,భాస్కర్,బండ్లయ్య,రాజా సాహెబ్,మస్తాన్, చాంద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందచేస్తున్న ఆర్‌టిఈ పేరెంట్స్ సమితి సభ్యులు

**కల్లూరు, మేజర్‌న్యూస్ :** ప్రైవేటు పాఠశాలలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఆర్‌టిఈ పేరెంట్స్ సమితి సభ్యులు కోరారు. సోమవారం ఆర్‌టిఈ విద్య హక్కు చట్టం 12-(సి)పై జిల్లా విద్యా శాఖ అధికారి డిఈఓకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భం ఆర్‌టిఈ పేరెంట్స్ సమితి సభ్యులు మాట్లాడుతూ నగరంలో ఉన్న ప్రైవేటు స్కూల్స్ కల్లూరు ఆదిత్య స్కూల్, రవీంద్ర స్కూల్, శ్రీ చైతన్య, నారాయణ, మాంటిస్సోరి, భాష్యం, క్రెడ్ స్కూల్‌లు ఆర్‌టిఈ యాక్టు 2025 నూతనంగా వచ్చిన విద్యార్థులను మరియు 2019 మరియు 2024 ఆర్‌టిఈ విద్యాహక్కు చట్టం పేరెంట్స్, విద్యార్థులను మా స్కూళ్లకు రావద్దని మా దగ్గర ఎలాంటి ఆర్‌టిఈ ఎవరికి ప్రవేశం లేదని, కేవలం డబ్బులు(ఫీజు) అదనంగా చెల్లిస్తే మా స్కూల్‌లో అడ్మిషన్ దొరుకుతుందని లేదంటే వేరే స్కూల్‌కి వెళ్లాలని తల్లిదండ్రులతో చెబుతున్నారని వాపోయారు. ఈ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిఈఓను కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు చామకూరు వీరప్ప, ప్రసాద్, సుధీర్, రామాంజనేయులు, కిరణ్, రాము, అన్వర్ బాష తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతికి చిరుత

**కర్నూలు, మేజర్‌న్యూస్ :**

కోసిగి గ్రామ శివారులో ఆదివారం రోజు బంధించిన చిరుతపులిని మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర జువలాజికల్ పార్కుకు తరలించినట్లు జిల్లా అటవీ అధికారి పి శ్యామల తెలిపారు. సోమవారం రెస్క్యూ టీం ఎన్‌ఎస్‌టిఆర్ ఆధ్వర్యంలో సురక్షితంగా చిరుతను తరలించామని, దాని ఆరోగ్యం నిలకడగా ఉందని ఆమె చెప్పారు. ఎక్కడైనా చిరుతపులుల సంచారాన్ని గమనిస్తే ప్రజలు భయాందోళనకు గురికాకుండ అటవీ అధికారులకు సమాచారం అందించాలని ఆమె ప్రజలను కోరారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం వాటికి హాని కలిగిస్తే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

# తల్లికి వందనం అభినందనీయం

**– 38వ వార్డు టీడీపీ ఇన్‌ఛార్జ్ తాటికొండ బుగ్గరాముడు**



**నంద్యాల నూనెపల్లె, మేజర్‌న్యూస్ :** తల్లికి వందనం అమలు చేయడం అభినందనీయమని 38వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి, సీనియర్ టీడీపీ నాయకుడు తాటికొండ బుగ్గరాముడు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని అన్నారు. అర్హత ఉండి జమ కాని వారికి 5వ తేదీ రెండవ విడతలో జమ అయ్యే అవకాశం ఉందని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం ప్రజాధరణ పొందుతుందని అన్నారు. తాజాగా తల్లికి వందనం పేరుతో కూటమి ప్రభుత్వం తల్లుల ఖాతాలలో సొమ్ము జయ చేస్తుందని అన్నారు. చాలా మంది తల్లులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని, విద్యార్థినీ, విద్యార్థులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. నేటి ఆధునిక చదువులలో ఫీజులు తల్లిదండ్రులకు భారంగా ఉందని, చదువుయ్యే ఖర్చులు పెరిగాయని, అటువంటి తరుణంలో పిల్ల చదువులకి ప్రభుత్వం సహాయం అందించి ప్రోత్సహిస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ప్రభుత్వం అందించిన సహాయానికి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలుపుతున్నారని ఆయన అన్నారు.

# అంగన్వాడీ కార్మికులకు ప్రభుత్వ పథకాలు వర్తింపచేయాలి




తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న అంగన్వాడి కార్యకర్తలు

**పత్తికొండ, మేజర్ న్యూస్ :** అంగన్వాడి కార్మికులకు ప్రభుత్వ పథకాలు వర్తింప చేయాలని సీఐటీయు మండల కార్యదర్శి గోపాల్, నాయకులు రవిచంద్రలు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అంగన్వాడి కార్మికులకు, హెల్పర్స్‌కు ప్రభుత్వపథకాలు అందడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సూపర్‌సిక్స్ పథకాలు తల్లికి వంద నం, గ్యాస్ సబ్సిడీ అంగన్వాడీలకు వర్తింపజేయ డం లేదని వారికి కూడ తల్లికి వందనం ఇవ్వా లని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం అంగన్వాడి కార్మికులకు జీతాలు పెంచుతామని ప్రభుత్వ పథకాలు అమలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకుండా అంగన్వాడి కార్మికులను విస్మరిస్తుందన్నారు. అనంతరం తహశీల్దార్ హుసేన్ సాహెబ్‌కు సీఐటీయు ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. సీఐటీయు నాయకులు దస్తగిరి, ప్రజా నాట్యమండలి నాయకులు రమేష్, సీపీఎం నాయకులు మేఘనాథ్, అంగన్వాడి మహిళలు పాల్గొన్నారు.

# యధావిధిగా కార్మికుల నిరసన



**కర్నూలు నగరం, మేజర్‌న్యూస్ :** నగరపాలక సంస్థలోని ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న వాటర్ వర్క్స్ సిబ్బంది ఈ నెల 10వ తేదీ నుంచి సమ్మె చేస్తున్న విషయం విధితమే. అందులో భాగంగా సోమవారం కూడా సమ్మె చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని గత కొన్నేళ్లుగా ప్రభుత్వాన్ని విన్నవించుకుంటున్నా పట్టించుకోవడం లేదని కార్మిక నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి మా డిమాండ్లను పరిష్కరించాలని లేనిపక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.

# నూతన మండల వ్యవసాయ అధికారిణిగా కలిమున్నీసా బాధ్యతలు స్వీకరణ



**అవుకుమేజర్,న్యూస్:** నందికొట్కూరులోని సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయంలో టెక్నికల్ వ్యవసాయ అధికారినిగా పని చేస్తున్న కలిమున్నిసా బదిలీపై అవుకు మండల వ్యవసాయ అధికారిణిగా బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం పని చేస్తున్న మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్ అనంతపురం జిల్లా కదిరి నియోజకవర్గంలోని నల్లమాడకు బదిలీ అయ్యారు.

# వైభవంగా ఉమామహేశ్వరుల పల్లకీ సేవ



**బనగానపల్లెరూరల్,న్యూస్:** ఎర్రమల్ల కొండల్లో వెలిసిన ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటి శ్రీ ఉమామహేశ్వరస్వామి దేవస్థానం నందు సోమవారం సందర్భంగా స్వామి అమ్మవార్లకు పల్లకి సేవ నిర్వహించడం జరిగింది. స్వామి వారు ఉత్సవ విగ్రహాలను భక్తిశ్రద్ధలతో అలంకరించి పల్లకిలో కూర్చొబెట్టి ప్రధాన ఆలయం చుట్టూ పల్లకి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాతపాడు సర్పంచ్ మహేశ్వరెడ్డి దంపతులు , ఆలయ ఈ.ఒ చంద్రుడు, యాగంటిపల్లె మౌళీశ్వర రెడ్డి, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలు సీఎం చంద్రబాబుతోనే సాధ్యం

**– మాజీ మార్కెట్‌యార్డు ఛైర్మెన్ భాస్కర్‌రెడ్డి**



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

**ఆదోని, మేజర్ న్యూస్ :** సంక్షేమ పథకాలు సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మసూదియా హైస్కూలు లో మాజీ మార్కెట్‌యార్డు ఛైర్మన్, వి ద్యార్థులు సీఎం చంద్రబాబు ఫోటోకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన తల్లికి వందనం ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లుల బ్యాంకు అకౌంట్లో జమ చేయడం జరిగింది. గతం లో జగన్ ఇద్దరికే అమ్మ ఒడి అందజేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎంతమంది ఉంటే విద్యార్థుల తల్లుల ఖాతాలో జమచేయడం అభినందనీయమన్నారు. సీఎం చంద్రబాబు రాష్ట్రం అభివృద్ధికోసం, విద్యార్థుల కోసం ఎంతో కష్టపడుతున్నట్లు తెలిపారు. టీడీపీ నాయకులు సౌదీరవూఫ్, మాజీ కౌన్సిలర్ రామచంద్రప్ప, షేక్షావలి, నాగరాజు, బి.టి.శీన, వాల్మీకి రాముడు, ఎం.డి. హుసేన్, టీడీపీ సోషల్ మీడియా మదిరె శ్రీనివాస్, హైస్కూలు సిబ్బంది పాల్గొన్నారు.

# అన్నదాత సుఖీభవకు ఈకేవైసీ చేయించుకోండి



మండల వ్యవసాయాధికారి స్వాతి

**వెలుగోడు, మేజర్‌న్యూస్ :** వెలుగోడు మండల రైతులు అన్నదాత సుఖీభవ ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి స్వాతి కోరారు. ఆమె మాట్లాడుతూ అన్నదాత సుఖీభవకు 9734 మంది రైతులు అర్హులుగా ఉన్నారని, వీరందరూ ఈ పథకం లబ్ధి కోసం ఆయా రైతు సేవా కేంద్రాలలో ఈకేవైసీ చేయించుకోవాలని పత్రికా ముఖంగా తెలిపారు. అర్హుల జాబితా, ఆయా రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉందని ఆమె అన్నారు.

# యోగాతో ఒత్తిడి జయించవచ్చు – ఎంపీడీఓ గోపీకృష్ణ



**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** యోగాతో ఎలాంటి మానసిక ఒత్తిడి అయినా జయించవచ్చని ఎంపీడీఓ గోపీకృష్ణ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ రాజకుమారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ గోపీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ యోగాను జీవన శైలిలో ఒక భాగం చేసుకోవాలని అన్నారు. దీని వల్ల మానసిక, శారీరకంగా ఆరోగ్యంగా ఉండవచ్చని అన్నారు. ప్రతిఒక్కరు యోగా చేయాలని పిలుపునిచ్చారు.

సూర్య
www.suryaa.com
మంగళవారం | 17 జూన్ 2025

# చంద్రబాబు ఏడాది పాలన చీకటిరోజులు

– రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో అరాచకం
– కోడుమూరు వైసీపీ ఇంఛార్జ్ ఆదిమూలపు సతీష్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైసిపి ఇంచార్జ్ సతీష్

**కర్నూలు రూరల్, మేజర్‌న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏడాది పాలన చీకటిరోజులని, రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో అరాచకాలు చేస్తున్నారని కోడూమురు వైసిపి ఇంచార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ అన్నారు. సోమవారం ఆదిమూలపు సతీష్ తన కార్యాలయంలో 40వ వార్డు కార్పొరేటర్ స్టాండింగ్ కమిటీ మెంబర్ విక్రమ సింహారెడ్డి, జడ్‌పిటిసి ప్రసన్న కుమార్, మండల ఉపాధ్యక్షులు నెహమియా, మండల కన్వీనర్ మోహన్‌బా బులతో కలిసి కూటమి ప్రభుత్వ ఏడాది పాలనా వైఫల్యాలపై వైసిపి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది విధ్వంసకర పాలనకు ఈ పుస్తకం అద్దం పడుతుందన్నారు. వాస్తవాలు తెలుసుకునేందుకు ప్రజలకు అందుబాటులో ఈ పుస్తకం ఉంచుతామన్నారు. చంద్రబాబునాయుడు ఆయన తనయుడు నారా లోకేష్‌లు రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో ఒక అరాచకాన్ని సృష్టించారన్నారు. జగన్ అధికారంలో ఉన్నప్పుడు పార్టీ, కులం, మతం చూడకుండ అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందించారని ఆయన గుర్తు చేశారు. జగన్ ప్రవేశపెట్టిన పథకాలకు చంద్రబాబు పేర్లు మార్చి ఇస్తు న్నారని అది కూడా సగం మందకి మాత్రమే అందుతున్నాయని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో అధికార ప్రతినిధి పోలకల్ ప్రభాకర్‌రెడ్డి, కోడుమూరు ప్రచార విభాగం అధ్యక్షులు వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్‌సి సెల్ అధ్యక్షులు బుజ్జన్న, రేమట సంప త్ కుమార్, ఎంపిటిసి గోపాల్, కృష్ణ, ఆదాం, మధు, క్రిష్ణారెడ్డి, ఎదురూరు వెంక టేష్, బైరాపురం క్రిష్ణ, మధుశేఖర్, శివుడు, అయ్యస్వామి, అనిల్ బాషా, మహేష్, మద్దిలేటి, రామరాజు, క్రిష్ణ, సలీం, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మండల వ్యవసాయాధికారిగా మధుమతి



**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** వ్యవసాయ శాఖ కమీషనర్ ఉత్తర్వులమేరకు మండల వ్యవసాయాధికారి సుధాకర్‌ను ఆదోని మండలానికి బదిలీ చేశారు. కర్నూలు కార్యాలయంలో మట్టి నమూనాల పరిశోధన విభాగంలో పనిచేస్తున్న మధుమతిని ఓర్వకల్లు మండలానికి బదిలీ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం ఆమె మండల ఏఓగా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటానని రైతులు వారి సమస్యలు తెలియజేయవచ్చునని, ప్రజలకు సలహాలు, సూచనలిస్తూ మండలంలో వ్యవసాయ రంగాన్ని మరింతగా ముందుకు తీసుకెళ్తానని తెలిపారు.

# అందరి ఆశీర్వాదంతో విధులను సక్రమంగా నిర్వహిస్తా

– డిసియంయస్ ఛైర్మెన్ వై.నాగేశ్వరరావు యాదవ్



నాగేశ్వరరావు యాదవ్‌కు అభినందనలు తెలుపుతున్న నాయకులు

**కర్నూలు, మేజర్‌న్యూస్ ప్రతినిధి :** తెదేపా జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్, జిల్లా నాయకులందరి ఆశీర్వాదంతో నా విధులను సక్రమంగా నిర్వహిస్తానని డిసియంయస్ చైర్మన్ వై నాగేశ్వరరావు యాదవ్ అన్నారు. సోమవారం ఉమ్మడి కర్నూలు జిల్లా మార్కెటింగ్ సొసైటీ చైర్మన్‌గా నంద్యాల మార్కెట్‌యార్డు నందు పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. తన నియామకానికి సహకరించిన ప్రతిఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. అలాగే జిల్లా మంత్రి, ఎంపి, ఎమ్మెల్యేలు, ఎంఎల్‌సిలు, రాష్ట్ర స్థాయి/జిల్లా చైర్మన్లకు, డైరెక్టర్లకు, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతాంగానికి పేరుపేరున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. మీ సహకారం ఇలాగా అందివ్వాలని ఆయన కోరారు.

# వెన్నుపోటు పొడిచింది ఎవరో రాష్ట్ర ప్రజలకు తెలుసు..

– ఎన్టీఆర్‌ను అధికారం కోసం వెన్నుపోటు పొడిచింది చంద్రబాబే... – ఎమ్మెల్యే



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచింది ఎవరో అందరికి తెలుసని ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వెన్నుపోటు పొడిచి, పార్టీని అధికారంను లాక్కున్నది చంద్రబాబు కాదా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఎద్దేవా చేశారు. సోమవారం ఎమ్మెల్యే స్వగృహంలో వైఎస్సార్సిపి జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి నాలుగు మండలాల నాయకుల సమక్షంలో వెన్నుపోటుపై పుస్తకం ఆవిష్కరణ, కరపత్రాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, చంద్రబాబు అంటేనే వెన్నుపోటు రాజకీయం, తన స్వప్రయోజనాల కోసం ఎన్డీయే కూటమితో ఒకసారి యుపిఏ కూటమితో మరోసారి జత కట్టి ప్రజలను వెన్నుపోటు పొడిచింది చాలని, ఈ కూటమి ప్రభుత్వం సంవత్సర పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి, తన రెడ్‌బుక్ రాజ్యాంగం ప్రకారం రాష్ట్రంలో ఆశాంతి, ఆరాచకం, మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు, అన్యాయం, అబద్దాలతో చట్టాన్ని ఉల్లంఘించడంలో లా అండ్ అర్డర్ రాష్ట్రంలో క్షిణించిందని ఆయన ఆరోపించారు. అదే మన జగనన్న పరిపాలన కాలంలో ప్రజలందరికి జగన్ అంటే నమ్మకం, భరోసా ఉండేదని, అర్హులైన ప్రతి ఒక్కరికి పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందివ్వడం జరిగిం దన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సిపి జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తంరెడ్డి, మంత్రాలయం, కోసిగి, పెద్దకడుబూరు, కౌతాళం మండల కన్వీన ర్లు భీమారెడ్డి, బెట్టనగౌడ్, రామ్మోహన్‌రెడ్డి, ప్రహ్లద చార్, నియోజకవర్గ బీసీసెల్ అధ్యక్షులు నాగరాజు, బూత్ కమిటీ అధ్యక్షులు చంద్ర శేఖర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శులు ఏకాంబ రెడ్డి, మాబుసాబ్, రాష్ట్ర విభ జన విభాగం జాయింట్ సెక్రటరీ రఘురాం, గజేం ద్రరెడ్డి, మాజీ అర్లబండ సహాకార సంఘం అధ్యక్షు లు మహాంతేష్ స్వామి, కామన్‌దొడ్డి, నరసింహు లు, దొడ్డి నరసన్న, ఎంపిపి అమరేష్, బుజ్జి స్వా మి, రాజశేఖర్‌రెడ్డి, శివరాం, తదితరులు పాల్గొన్నారు.

# జావాబుదారీతనంతో అర్జీలు పరిష్కరించాలి

– నగరపాలక కమీషనర్ రవీంద్రబాబు




ప్రజా ఫిర్యాదులు తీసుకుంటున్న కమీషనర్

**కర్నూలు నగరం, మేజర్‌న్యూస్ :** ప్రజల నుండి వస్తున్న అర్జీలను సంబంధిత అధికారులు జవాబుదారీతనంతో సత్వరమే పరిష్కరించాలని నగరపాలక కమీషనర్ యస్ రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయలలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 14అర్జీలు వచ్చాయి. అర్జీదారుల సమస్యలు అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమీషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమీషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమీషనర్ సతీష్‌రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్‌రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఆర్‌ఓ జునైద్, ఎంఈలు శేషసాయి, లీల ప్రసాద్, టిడ్కో అధికారి పెంచలయ్య, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా కొబ్బరి చెట్ల నరికివేత

కలెక్టర్‌కి ఫిర్యాదు చేసిన బాధితురాలు



నరికివేతకు గురైన కొబ్బరి చెట్లు

**బండి ఆత్మకూరు రూరల్, మేజర్ న్యూస్ :** మండలంలోని పార్నపల్లి గ్రామంలో పొలం గట్టు వెంట ఉన్న కొబ్బరి చెట్లను నరికి వేసిన ఘటన ఆలస్యంగా విలువకు వచ్చింది. దీనిపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పార్నపల్లి గ్రామానికి చెందిన పద్మావతి జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు బాధితురాలు పద్మావతి మాట్లాడుతూ పార్నపల్లి గ్రామంలోని సర్వే నెంబర్ 89 లో పొలం కలదు అన్నారు. ఈ పొలం గట్టు వెంట 40 సంవత్సరాలుగా పెంచిన పది కొబ్బరి చెట్లు ఉన్నాయని , ఈనెల తొమ్మిదవ తేదీన అదే గ్రామానికి చెందిన ద్వారం సుదర్శన్ రెడ్డి అతని భార్య పుష్పవతమ్మలు కలిసి జెసిబి తో అక్ర మంగా కూల్చివేసి తమను నష్టపరిచారన్నారు. తమ కొబ్బరి చెట్లను ఎందుకు కూల్చి వేసారని ప్రశ్నించగా తమ పట్ల నిర్లక్ష్య ధోరణితో మాట్లా డుతూ బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. అధికారులు స్పందించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకొని, తమకు న్యాయం చేయాలని కోరారు.

# ఒత్తిడిలో ఉపశమనం పొందేందుకు యోగా

– మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ చిట్టి నరసమ్మ



యోగాసనాలు వేసిన దృశ్యం

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** ప్రజలు రోజు వారి పనుల ఒత్తిడితో సాగిస్తున్న జీవన విధానాలపై ఉపశమనం పొందేందుకు ప్రతిరోజు 30ని॥ల యోగా చేయాలని అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, కర్నూలు మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ చిట్టి నరసమ్మ అన్నారు. యోగాంధ్ర సెషన్స్‌లో భాగంగా సోమవారం నగరంలోని మెడికల్ కాలేజ్ నందు యోగాంధ్ర సెషన్ నిర్వహించారు. ఈ యోగా సెషన్ పతంజలి యోగా సమితి( యోగా గురువు యస్‌వి శివరాజు), భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ యొక్క యోగా గురువు ఉపేంద్ర, వారి శిష్యులు యోగాచారి రంగా, శ్రీనివాసులు ఆద్వర్యంలో యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్‌లు డా. సాయి సుధీర్, డా. రేణుక దేవి, అసోసియేట్ ప్రొఫెసర్ డా. సోమశేఖర్, కాలేజీ సిబ్బంది, వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొ న్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 21న ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యో గా దినోత్సవం పురస్కరించుకుని ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని మెడికల్ కాలేజీల్లో యోగా సెషన్స్ నిర్వహిం చడం జరుగుతుందని అందులో భాగంగానే కర్నూలు మెడికల్ కాలేజీలో కూడా యోగా సెషన్ నిర్వహించినట్లు ప్రిన్సిపల్ చిట్టి నరసమ్మ తెలిపారు. అలాగే ఈ నెల 21న పెద్ద ఎత్తున యోగా సెషన్ నిర్వహిస్తామని తెలియజేశారు.

# గుత్తేదారులు నాణ్యతను పాటించాలి

– ఎమ్మెల్యే పార్థసారథి



రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

**ఆదోని, మేజర్ న్యూస్ :** గుత్తేదారులు నాణ్యతను పాటించాలని ఎమ్మెల్యే పార్థసారధి పేర్కొన్నారు. సోమవారం ఆదోని రైల్వేస్టేషన్ పరిధిలోని జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైల్వే ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం రైలు కంబీలకు ఇరువైపులా ప్రహరీగోడ ఏర్పాటు చేస్తుందని, ప్రమాదాలను అరికట్టేందుకు ఆదోనిలో కూడ ఇలాంటి పనులు అధికారులతో కలిసి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. మూగ జీవాలు కూడ ప్రమాదాలకు గురి కావడం ప్రమాదాల కట్టడకి ప్రహరీగోడలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

# నూతన ప్లేస్‌మెంట్ డైరెక్టర్‌గా జస్విందర్ కౌర్



**కల్లూరు, మేజర్‌న్యూస్ :** అశోకా మహిళా ఇంజనీరింగ్ కాలేజీలో నూతన ప్లేస్‌మెంట్ డైరెక్టర్‌గా జస్విందర్ కౌర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అశోకా కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ నవీన్ మాట్లాడుతూ అశోక మహిళా ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులకు మంచి ఉద్యోగ అవకాశాలు అందించేందుకు మరో కీలక అడుగు వేశామన్నారు. ప్లేస్‌మెంట్ రంగంలో అనుభవం ఉన్న జస్విందర్ కౌర్‌ని నూతన ప్లేస్‌మెంట్ డైరెక్టర్‌గా నియమించినట్లు తెలిపారు. మనస్తత్వం (యాటిట్యూడ్), మాట్లాడగలిగే నైపుణ్యం( కమ్యూనికేషన్), సాంకేతిక విజ్ఞానం(టెక్నికల్ నాలెడ్జ్) ఈ మూడు అంశాల్లో అభివృద్ధి సాధిస్తే ఎలాంటి కంపెనీలోనైనా అవకాశాలు వస్తాయని ప్లేస్‌మెంట్ డైరెక్టర్ జస్విందర్ కౌర్ అన్నారు.

# సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి

### – జిల్లా కలెక్టర్ రాజకుమారి




పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గట్టి చర్యలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం స్టాప్ డయేరియా పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డిఆర్ఓ రాము నాయక్, డిప్యూటి కలెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ వర్షాల వల్ల నీరు కలుషితం కాకుండా మున్సిపల్ కమీషనర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లు, ఎంపీడీఓలు, తహశీల్దార్లు, ఈఓఆర్‌డిలు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండలాల్లో ఎక్కడైతే చెత్తా చెదారం ఎక్కువగా ఉంటుందో వాటిని ఆశా, ఏఎన్ఎంలు వెక్టర్ యాప్‌లో ఫోటో తీసి అప్‌లోడ్ చేయడం జరుగుతుందని తెలిపారు. వాటిని పంచాయతీ సెక్రటరీ పరిశీలించి సమస్య పరిష్కరించాలని తెలిపారు. అదే విధంగా వాటర్ అండ్ శానిటేషన్ యాప్‌లోనూ హెచ్2ఎస్ పరీక్షను నిర్వహించి ఎక్కడా నీటి కాలుష్యం జరుగకుండా క్లోరినేషన్ చేయాలని తెలిపారు. అదే విధంగా సిఆర్1 యాప్‌లో సరైన డేటా నమోదు చేయాలని తెలిపారు.

# విద్యతోనే మహిళా వికాసం

- భారత మహిళా సైనికుల వల్లే ఆపరేషన్ సింధూర్ విజయవంతం
- నంద్యాల ఎంపీ డా.బైరెడ్డి శబరి



కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ, అధికారులు

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** ప్రపంచంలోనే భారతీయ మహిళలకు ప్రత్యేక గౌరవం, గుర్తింపు ఉందని ఇటీవల బ్రెజిల్ దేశంలో జరిగిన 11వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో తాను ప్రత్యక్షంగా చూసానని నంద్యాల ఎంపీ, లోక్‌సభ టీడీపీ డిప్యూటి ఫ్లోర్ లీడర్ డా.బైరెడ్డి శబరి అన్నారు. సోమవారం నంద్యాల ఎస్‌బిఐ కాలనీలోని శ్రీ రామకృష్ణా డిగ్రీ, పిజి కళాశాల బాలికల వసతి గృహాల ఆవరణలో 9వ ఆంధ్ర ఎన్‌సిసి కర్నూలు బెటాలియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న కంబైన్ ఆన్యువల్ ట్రైనింగ్ క్యాంప్ నిర్వహణ ముగింపు కార్యక్రమంలో నంద్యాల ఎంపీ డా.బైరెడ్డి శబరి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నంద్యాల ఎంపీ డా.బైరెడ్డి శబరి మాట్లాడుతూ ఏ దేశంలో లేని విధంగా భారత దేశంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు మన దేశంలో అమలవుతున్నాయని అన్నారు. దీంతో మహిళా సాధికారత సాధ్యమవుతుం దన్నారు. దేశం కోసం ఎంతో మంది మహిళలు త్యాగాలు చేశారని అన్నారు. వారి స్ఫూర్తితో ప్రతి విద్యార్థిని ముందుకు సాగాలని అన్నారు. మహిళలు తమ కాళ్లపై సొంతంగా నిలబడేందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తుందన్నారు. ప్రధాని నరేంద్ర మోడి ప్రభుత్వం మహిళా పక్షపాతి అని అన్నారు. ఆపరేషన్ సింధూర్ విజయవంతంలో భారత మహిళా సైనికుల పాత్ర మరువలేనిదని అన్నారు. ఎన్‌సిసి విద్యార్థినిలు ఎంతో ధైర్యవంతులు అని భారత సైన్యంలో చేరి దేశ సేవ చేయాలని పిలుపునిచ్చారు. నంద్యాలలో అంతర్జాతీయ విద్యా ప్రమాణాలతో శ్రీ రామకృష్ణా విద్యా సంస్థలు విద్యను అందించడం, విద్యా సంస్థల అధినేత డా.రామకృష్ణా రెడ్డి విద్యార్థుల అభివృద్ధి కోసం చేస్తున్న సేవలు గొప్పవని అన్నారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ మహిళా సాధికారత అంటే నంద్యాల ఎంపీ డా.బైరెడ్డి శబరి నిదర్శనమని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడులు ఎంపీ శబరికి ఇస్తున్న ప్రాధాన్యత మహిళా సాధికారతకు నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని కళాశాలల నుంచి వచ్చిన 600 మంది ఎన్‌సిసి కెడేట్స్ దేశ భక్తి గీతాలు, పాటలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా అందరిని ఆకట్టుకున్నాయి. శ్రీ రామకృష్ణా విద్యా సంస్థల అధినేత డా.రామకృష్ణా రెడ్డి, పిజి కళాశాల డైరెక్టర్ హేమంత్ రెడ్డి, విజయకుమారి, క్యాంప్ కమాండెంట్ జోబి ఫిలిప్, డిప్యూటి క్యాంప్ కమాండర్ శ్రీప్రియ, డా.లలితా సరస్వతి, సెంట్రల్ ఫుడ్ కార్పోరేషన్ డైరెక్టర్ నరహరి విశ్వనాథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కోసిగి బస్టాండ్‌లో ఘోరం

- వృద్ధురాలిపై హత్యాచారామా..? హత్యాచారయత్నమా..?
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటన
- మతిస్థిమితం సరిగ్గా లేని మహిళపై దారుణం
- వీడియోలో రికార్డు అయిన సంఘటన



వీడియోలో రికార్డు అయిన కామాంధుడు

**కోసిగి మేజర్ న్యూస్:** మండల కేంద్రమైన కోసిగి బస్టాండ్‌లో ఘోరమైన సంఘటన చోటుచేసుకుంది. చాలా రోజుల తరువాత వీడియో రూపంలో బయటికి రావడంతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత కొన్నిరోజుల క్రితం కోసిగి బస్టాండ్‌లో మతస్థిమితంలేని వృద్ధురాలు బిక్షాటనచేస్తూ బస్టాండ్‌లోనే పడుకోవడం జరుగుతుంది. అయితే ఈవిషయాన్ని కోసిగి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి కాపు కాసి ఆమెపై ఆశపడ్డాడు. ఈనెల 2వతేదీన రాత్రి రెండుగంటల సమయంలో ఆ మహిళను వెనుకనుండి ఎత్తుకొని చీకట్లో ఉన్న దుకాణంలోకి తీసుకెళ్ళి హత్యాచారం చేశారా..? లేక హత్యాచారయత్నం చేశారా..? అన్న అనుమానం వ్యక్తమవుతుంది. అయితే అక్కడున్న కొంతమంది ఆ వ్యక్తిని సర్దిచేసేందుకు ప్రయత్నించినా.. వారిపైదాడి చేసేందుకు ప్రయత్నించారని ఆ మహిళపై హత్యాచారం జరిగి ఉండవచ్చని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ మహిళ ఆ కామాంధుడికి ఎంతచెప్పినా.. వినకుండా నేను మీకు తల్లితోసమానం.. అమ్మలాంటిదానిని వదిలిపెట్టు, కాళ్ళు మొక్కుతా.. వదిలేయ్ అన్నాకుడా కామంతో కళ్ళుమూసుకున్న వ్యక్తి ఆమెపై పశువులా పడి అత్యాచారం చేసినట్లు బస్టాండ్ ఆవరణంలో చర్చించుకుంటున్నారు. ఆ ప్రదేశంలోనే ఓ మతిస్థితిమితంలేని మహిళ ఆ కామాంధుడు చేస్తున్న దారుణాన్ని అరికట్టేందుకు రాళ్ళతోను చెప్పులతోను దాడిచేసినా.. లెక్కచేయకుండా ఆ మహిళపై హత్యాచారం చేసినట్లు తెలుస్తుంది. అయితే ఈ సంఘటన తెలిసిన స్థానికులు ఆ వ్యక్తికి బడిపూజ కూడా చేసినట్లు, మళ్ళీ ఇక్కడికొస్తే జాగ్రత్త పోలీసులకు చెబుతామని బెదిరించడంతో ఆ వ్యక్తి అప్పటి నుండి కోసిగిలో కనిపించడంలేదు. అలాగే ఆ మహిళ కూడా కనిపించడంలేదు.

# యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలి



**బనగానపల్లెమేజర్,న్యూస్:** నిరుద్యోగ యువతీ యువకులు ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బి.సి రాజారెడ్డి అన్నారు. సోమవారంనాడు బనగానపల్లె పట్టణంలోని ఖాజివాడకు చెందిన అల్లాం కుమారుడు జహీర్ నూతనంగా ఏర్పాటు చేస్తున్న న్యూ వెల్‌కం ఫోటో స్టూడియోను బి.సి రాజారెడ్డి సోమవారం ప్రారంభించా రు. ఈ సందర్భంగా బి.సి రాజారెడ్డి మాట్లా డుతూ ప్రస్తుత సమాజంలో చాలా మంది ఉన్నత చదువులు చదివి ఉద్యోగ అవకాశాల కోసం ఎదురు చూసి సమయం వృధా చేసు కోవడం సమంజసం కాదని ప్రతి ఒక్కరిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉందని దానిని గుర్తించి స్వయం ఉపాధివైపు అడుగులు వేసి ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు.

# ఎస్.డి.ఆర్ ఆకాంక్ష కళాశాల విద్యార్థులను అభినందించిన మంత్రి ఫరూక్




**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్ :** 2025 నీట్ ఫలితాలలో ఆల్ ఇండియా ర్యాంకుల తో ఎస్.డి.ఆర్ ఆకాంక్ష జూనియర్ కాలేజి విద్యార్థు లు పి. భువన్ తేజ –610 మార్కులు ( ఆల్ ఇండియా ర్యాంక్ 221), పివి. జితేంద్ర – 543 మార్కులు ( ఆల్ ఇండియా ర్యాంక్ – 6586), వై ద శిక్షిత్ రెడ్డి – 535 మార్కులు ( ఆల్ ఇండియా ర్యాంక్ – 8446), ఎం ముని జాహ్నవి – 530 మార్కులు ( ఆల్ ఇండియా ర్యా – 9642), బి. హనోక్ స్ఫురణ రాజ్ – 424 మార్కులు ( ఆల్ ఇండియా ర్యాంక్ – 8774( ఎస్సీ ), వై. అఖిల – 414 మార్కులు ( ఆల్ ఇండియా ర్యాంక్ – 10611 ( ఎస్సీ )) తో ప్రభంజనం సృష్టించడంతో మంత్రి ఎన్ఎండి ఫరూక్ విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ మన నంద్యాల విద్యార్థులు ఆల్ ఇండియా లెవెల్ లో ఇలాంటి అద్భుతమైన ర్యాంకులు సాధించిడం మన నంద్యాల జిల్లాకు గర్వకారణం అన్నారు. ఈ సందర్భముగా అత్యధిక ర్యాంకులు సాధించిన విద్యర్థినీ, విద్యార్థులను మరియు ఇందుకు కృషి చేసిన చైర్మన్ కొండా రెడ్డిని మరియు అధ్యాపకులను మంత్రి ఫరూక్ ప్రత్యేకముగా అభినందించారు. ఇలాంటి అద్భుతమైన ఫలితాలను ప్రతి సంవత్సరం సాధించాలని, మన నంద్యాలను దేశ స్థాయిలో నిలబెట్టాలని మనస్పూర్తిగా కోరుకుంటునట్లు తెలిపారు.

# కెఎంసి విద్యార్థులకు కంప్యూటర్లు అందజేసిన పూర్వ విద్యార్థులు



కంప్యూటర్ విభాగాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ డా.చిట్టినరసమ్మ

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** కర్నూలు మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థులు, ప్రస్తుతం అమెరికాలో ఉన్న డా.బి ఆదిశేషారెడ్డి సతీమణి డా.ఎన్ రేణుకారెడ్డిలు మెడికల్ కాలేజీలో చదువుతున్న విద్యార్థుల కోసం అత్యాధునిక కంప్యూటర్లు, స్పీడ్ ఇంటర్‌నెట్‌ను కాలేజీ లైబ్రరీలో అమర్చారు. సోమవారం మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ చిట్టి నరసమ్మ, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా వెంకటేశ్వర్లు కంప్యూటర్ విభాగాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. పూర్వ విద్యార్థులు ప్రస్తుత విద్యార్థుల చదువు కోసం కంప్యూటర్లు, స్పీడ్ నెట్‌ను ఏర్పాటు చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజీ గ్రాడ్యుయేట్స్ ట్రస్టు ప్రెసిడెంట్ రామలింఆరెడ్డి, అల్యూమ్ని అసోసియేషన్ ప్రెసిడెంట్ కుమారస్వామిరెడ్డి, ట్రెజరర్ మహేశ్వరరెడ్డి, ఫండ్ రైజింగ్ కమిటీ చైర్మన్ గోవిందరెడ్డి, కమిటీ మెంబర్స్ మల్లికార్జునరెడ్డి, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్పీవైరెడ్డి కాలనీకి నూతన గ్రావెల్ రోడ్డు

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల టౌన్ స్థానిక ఎస్పీవైరెడ్డి స్మార్ట్ సిటీ కాలనీకి నూతనంగా గ్రావెల్ రోడ్డును ఏర్పాటు చేసినట్లు 38వ వార్డు వైఎస్‌ఆర్ నగర్ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి తాటికొండ బుగ్గరాముడు తెలిపారు. సోమవారం ఎస్పీవైరెడ్డి స్మార్ట్ సిటీ కాలనీకి రోడ్డు లేక చాలా రోజులుగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్న విషయం తెలుసుకొన్న బుగ్గరాముడు వెంటనే స్పందించి రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, రాష్ట్ర యువ నాయకుడు ఎన్ఎండీ ఫయాజ్‌ల దృష్టికి తీసుకెళ్ళడం జరిగిందని, వారు వెంటనే స్పందించి సొంత నిధులతో గ్రావెల్ రోడ్డును ఏర్పాటు చేసినట్లు బుగ్గ రాముడు తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలు రోడ్డు నిర్మాణానికి సహకరించిన మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు, ఎన్ఎండీ ఫిరోజ్‌కు, ఎన్ఎండీ ఫయాజ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. తమ సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించినందుకు బుగ్గరాముడికి కాలనీ ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



గ్రావెల్‌ను చదును చేస్తున్న జేసీబీ



రోడ్డుకు గ్రావెల్ తోలిన దృశ్యం

# పోలీసుల కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

**సరైన పత్రాలు లేని 09 మోటార్ సైకిళ్ళు,అక్రమ మద్యం 25 క్వాటర్ బాటిళ్ళు స్వాధీనం**

**ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకే కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహణ**



**పాములపాడు,మేజర్‌న్యూస్ :** నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు ఆత్మకూరు డిఎస్పి రామంజి నాయక్ సూచనలతో పాములపాడు సబ్ ఇన్స్పెక్టర్ సురేష్ మరియు వారి సిబ్బంది బృందాలుగా ఏర్పడి నేటి తెల్లవారుజాము న నేర నియంత్రణ మరియు శాంతి భద్రతల పరిరక్షణ నిమిత్తం కార్డన్ అండ్ సెర్చ్ఆపరేషన్ నిర్వహించడం జరిగిందని సోమవారం తెలిపారు.ఈ సందర్భంగా వానల (వాడాల)గ్రామంలో రౌడీషీటర్లు మరియు అనుమానితులు, నేర చరిత్ర గల వారి నివాసాల లోతనిఖీలు నిర్వహించడంజరిగిందని,ఈ సోదాలలో 29 క్వార్టర్ అక్రమ మద్యం మరియు సరైన ధ్రువపత్రాలు లేని 09 మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకోవడం జరిగిందని ప్రజల భద్రత కోసం, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అరికట్టేందుకు ఈ ఆపరేషన్లు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.అనంతరం కార్డెన్ అండ్ సర్చ్ చేసిన గ్రామాలలోని ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ముఖ్యంగా సైబర్ క్రైమ్, రోడ్డు ప్రమాదాలు, మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు మొదలగు వాటిపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు పోలీస్ అధికారులు అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు.

# తుగ్గలి వ్యవసాయ అధికారిగా సురేష్ బాబు



**తుగ్గలి,మేజర్‌న్యూస్:**తుగ్గలిమండల వ్యవసాయఅధికారిగాసురేష్‌బాబు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఆయన వ్యవసాయ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయం సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ మండలంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరిస్తానని తెలిపారు. రైతులకు ఎటువంటి సమస్యలు ఉన్న నేరుగా వచ్చి తనకు తెలపాలని సూచించారు.ఏఈవోలు సరస్వతి, లక్ష్మీ నారాయణ,మల్లేష్, అగ్రికల్చరల్‌అసిస్టెంట్‌రోహిత్‌కుమార్,ఎంపీఈవో్రవంతి పాల్గొన్నారు.

# వ్యవసాయ అధికారిగా కె. మహేంద్ర నియామకం

**కృష్ణగిరి, మేజర్ న్యూస్ :**



కృష్ణగిరి మండల వ్యవసాయ అధికారి గా కె. మహేంద్రను జిల్లా అధికారులు నియమించారు. అనంతపురం జిల్లా రాయదుర్గం ఎఓగా పనిచేస్తున్న కె.మహేంద్రను ఆ జిల్లా అధికారులు కర్నూలుకు బదిలీ చేశారు. కర్నూలు జిల్లా అధికారులు కృష్ణగిరి ఎఓగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కృష్ణగిరి మండల వ్యవసాయ అధికారి గా నియమితులైన కె. మహేంద్ర సోమవారం బాధ్యతలు చేపట్టి విధుల్లో నిమగ్నమైయ్యారు.

# వ్యవసాయ విద్యుత్ తీగలు చోరీ..

**వెల్దుర్తి మేజర్ న్యూస్:** వెల్దుర్తి పట్టణ సమీపంలోని ఊట మల్ల వంక ప్రాంతంలోనీ పొలాలలో ఉన్న విద్యుత్ తీగలను గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం రాత్రి సమయంలో చోరికి గురైనట్లు రైతులు కుమ్మరి రంగస్వామి, వడ్ల నాగేంద్ర,కుమ్మరి బాలుకు చెందిన స్టార్టర్ల నుండి బోర్ల దగ్గరకు వెళ్లిన విద్యుత్ కాపర్ వైర్ ను కోసుకొని ఎత్తుకెళ్లినట్లు రైతులు వాపోయారు. దాదాపు 18 ఎకరాల వ్యవసాయ భూమికి సాగునీరు అందించేందుకు వీలు లేకుండా పోయిందని రైతులు వాపోయారు. విద్యుత్ కాపర్ వైర్లను దొంగలించిన వారిని గుర్తించి వారి పైన కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

# విద్యా వ్యవస్థకు పెద్దపీఠ వేసిన చంద్రబాబు

**- తల్లికి వందనం పథకం ఒక చారిత్రత్మకం**

**- సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ**



**పగిడ్యాల మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాధికారం చేపట్టిన తర్వాత విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యా వ్యవస్థకు పెద్దపీఠ వేశారని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయ సూర్య అన్నారు. సోమవారం మండల కేంద్రమైన పగిడ్యాల తోపాటు సంకిరేణి పల్లె గ్రామాలలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదివే విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ చేస్తూ ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం అనంతరం తల్లికివందనం ద్వారా లబ్ది పొందినలబ్ధిదారుల(విద్యార్థుల) కుటుంబాలతో కలిసి మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు మరియు ప్రభుత్వ పని తీరుపై ప్రజలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో అర్హత ఉన్న ప్రతి విద్యార్థికి తల్లికివందనం పథకం ద్వారా ఇంట్లో ఎంతమంది ఉంటే అంత మందివిద్యార్థులకు రూ.15 వేలరూపాయలువిద్యార్థి తల్లి అకౌంట్లో డబ్బులు జమ చేస్తామని చెప్పిన విధంగా డబ్బులు జమచేయడం ఒక చారిత్రత్మకం అన్నారు. కూటమి ప్రభుత్వం ఇంట్లో ఎంతమంది ఉంటే అందరికీ తల్లికి వందనం ఇవ్వడం ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులు తరపున కూటమి ప్రభుత్వానికి విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శివ రాముడు ,ఎంపీడీవో సుమిత్రమ్మ, ఎంఈవో సుభాన్ టిడిపి మండల కన్వీనర్ పలుచాని మహేశ్వర రెడ్డి, టిడిపి నాయకులు పుల్యాల రాజశేఖర్ రెడ్డి బొగ్గుల దామోదర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# యోగా చేయండి-శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పొందండి

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరు యోగా క్రియలను ఆచరించి శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యాన్ని పొందాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పిలుపునిచ్చారు. సోమవారం నంద్యాల పట్టణంలోని టెక్కె మార్కెట్ యార్డు ప్రాంగణంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో మంత్రి ఫరూక్ ముఖ్య అతిథిగా పాల్గొని యోగాసనాలు వేశారు. నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి, జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, తదితరులతో కలిసి మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పండుగ వాతావరణంలో జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో 5200 మంది ప్రభుత్వ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ యోగా చేయడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గించుకోవడంతో పాటు శారీరక ధృడత్వాన్ని పెంచుకోవచ్చని అన్నారు. అమరావతి రాజధాని శంకుస్థాపనకు ప్రధానమంత్రి రానున్న సందర్భంలో జూన్ 21న విశాఖపట్నంలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి రావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆహ్వానించడం జరిగిందన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని యోగా కార్యక్రమానికి విజయవంతం చేయడానికి నెల రోజుల పాటు యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆరోగ్యం కోసం ప్రతిరోజు తనకు నడకతో పాటు స్కిప్పింగ్ అలవాటు ఉండేదని తెలిపారు. శ్రద్ధ, ఆసక్తి ఉంటేనే యోగా చేయగలమని తెలిపారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ప్రతి మనిషి తన జీవన శైలిలో యోగాను అలవాటు చేసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నెల రోజుల పాటు అన్ని గ్రామ, మండల, పట్టణ ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా ప్రతి ఒక్కరు యోగాసనాలు అలవాటు చేసుకోవాలని తెలిపారు. జిల్లాలో ప్రముఖ పర్యాటక ప్రాంతాలైన శ్రీశైలం, మహానంది, బెలూంగుహలు, తదితర ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 7.6 లక్షల మంది యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు నమోదైనట్లు తెలిపారు. ఇందుకోసం ప్రతి గ్రామ, వార్డు, అన్ని ప్రాంతాల్లో పెద్ద ఎత్తున యోగాంధ్ర కార్యక్రమం చేపట్టేందుకు పటిష్ట ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ప్రస్తుతం చేసిన యోగా ప్రోటోకాల్ ప్రతినిత్యం ఆచరించాలనే ప్రధాన ఉద్దేశంతోనే యోగా కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రతిఒక్కరు యోగాను అలవాటు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించేందుకు సహకరించిన హెల్త్, ఆయుష్ శాఖలను, రామచంద్ర మిషన్ సభ్యులు, కార్యక్రమంలో పాల్గొన్న వారికి కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా మాట్లాడుతూ ప్రతి నిత్యం యోగా అలవాటు చేసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ మాట్లాడుతూ అహోబిలం, పచ్చర్ల ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. మానవ జీవన శైలిలో యోగాను భాగం చేసుకోవాలని అన్నారు. యోగా పట్ల ఆసక్తి ఉండి నమోదు చేసుకున్న 7.6 లక్షల మందికి 380 మాస్టర్ ట్రైనర్స్, 4900 ట్రైనర్స్ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల ఆర్డీఓ విశ్వనాథ్, డిఎంహెచ్ఓ డా.వెంకటరమణ, ఆయుష్ సీనియర్ మెడికల్ అధికారి యశోధర, తదితరులు పాల్గొన్నారు.

# అధికార కూటమిది అరాచకపాలన..!!

**★ సిఎం సూపర్‌సిక్స్ అన్ని అమలు అనడం విడ్డూరం**

**★ఏడాదిగా వెన్నుపోటు .. వైసిపి ఒత్తిడితోనే అరకొర అమ్మకువందనం**

**★వైద్యశాలలో మందులు లేవు .. లక్షల ఉద్యోగాలు తొలగించారు..**

**★అత్యాచారాలను పట్టించుకోరు.. అక్రమకేసులు మాత్రం పెట్టేస్తారు**

**★లక్షల ఉద్యోగాలు తొలగించారు.. నిరుద్యోగభృతి ఇవ్వరు**

**★వెన్నుపోటు పుస్తకం ఆవిష్కరణలో మాజీ ఎంపి బుట్టారేణుక**

**ఎమ్మిగనూరు, మేజర్‌న్యూస్ ప్రతినిధి :** ఎన్నికల వరకు రాజకీయాలు చేయ్యాలి.. ఎన్నికలు అయ్యాక ప్రజలకు మంచి పాలన అందించాలి కాని అలాంటిది మానుకుని ఏడాదిగా కూటమి పాలకులు అరచక పాలన రాష్ట్రంలో కొనసాగిస్తున్నారంటూ కర్నూలు మాజీ ఎంపి, ఎమ్మిగనూరు వైకాపా సమన్వయకర్త బుట్టా రేణుక ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో వెన్నుపోటు పుస్తకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విలేఖర్ల సమావేశంలో ఆమె మాట్లాడు తూ జగన్ అంటే నమ్మకం.. బాబు అంటే మోసం అనేది ఏడాది పాలనలో మరోమారు రాష్ట్ర ప్రజలకు అర్థం అయ్యిందన్నారు. వైకాపా పోరుబాటలు చేపట్టేదాక ప్రజలకు సంక్షేమం



పుస్తకం ఆవిష్కరిస్తున్న దృశ్యం

అందించలేక పొయ్యారన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు అందిస్తామన్న సూపర్ సిక్స్ హామీలు అన్నీ తుంగలో తొక్కి పేదలను అన్యాయం చేసిన ఘనతను కూటమి పాలన దక్కించుకుందన్నారు. అధికారంలోకి రాకముందు వాలెంటీర్లకు 10 వేల జీత ం అందిస్తాం అని ఏకంగా వ్యవస్థను తొలగించి లక్షల ఉద్యోగాలు మాయంచేసిన ఘనత కూటమి పాలకులది కాదా అన్నారు. అలాగే ప్రజలను కష్టపెట్టే కుట్రలో రేషన్ బండ్లు తొలగించి అందులో ఉన్న ఉద్యోగలను రోడ్డున పాడేసిన చరిత్రతో ఉన్న కూటమి పాలకులు ఎన్నికల హామీలో ఉన్న 20 లక్షల ఉద్యోగాలు ఎన్నడు భర్తీ చేస్తారని ప్రశ్నించారు. అమ్మకు వందం అందరికీ అందించాలని ఎన్నికల ముందు షరతులు ఉండవు అన్నారు అమలుకు వచ్చేసరికి సవాలక్ష షరతులతో లక్షల మందికి అమ్మకు వందనం అందించకుండా పంగనామం పెట్టారని దుయ్యబట్టారు. మహిళలకు ఉచితబస్సు ప్రయాణంలో కొర్రు పెట్టి ఏ జిల్లా వాసులకు ఆ జిల్లాలోనే ప్రయాణ పరిమితం చేసేయత్నాలు మానుకుని పహిళలను ముంచకూడదన్నారు. ప్రతి పల్లెకు బస్సు సౌకర్యాలు కల్పించి ఉచిత బస్సు ప్రయాణాలు సాగించాలని సూచించారు. రైతులకు బరోసా ఎక్కడ.. రైతు కేంద్రలు ఏమయ్యాయి రైతులకు తెలియజెప్పాలని కూటమి నాయకులకు హితవు పలికారు. ఇక ఆరోగ్య సమస్యల తో ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లితే నాణ్యమైన మందులు కూడా కరువు చేశారన్నారు.అంతేకాక అరోగ్యశ్రీ పథకం సక్రమంగా అమలు చెయ్యడం లేదని ఆరోపించారు. మహిళలకు, చిన్నారులకు రక్షణ కరువైందని రాష్ట్రాన్ని అత్యాచారాంధ్రగా మార్చారన్నారు. అక్రకేసులపై ఉన్న ద్యాస ఆడపడుచుల ఆర్తానాదాలమీద పెట్టండన్నారు. ఉద్యోగాలు తొలగించడం సరే.. నిరుద్యోగభృతి అందిం చడంలో ఎందుకు ఏడాది గడిచిపోయింది.. నేతన్ననేస్తం లేదు, మహిళలకు 18 వేల ఆసరా ఎన్నడు జమచేస్తారు ఇవ్వన్ని ఇవ్వకుండానే ముఖ్యమంత్రి చంద్రబాబునాయు డు అన్నీ హామీలు ఇచ్చేశాం అనడం, ఇకపై హామీలు అమలు చెయ్యలేదని మాట్లాడే వారికి నాలుక మందం అంటూ మాట్లాడటం చాలా విడ్డూరంగా ఉందన్నారు. ఒకటి పెన్షన్,ఏడాదిపాలనకు అమ్మకువందనంఅది అరకొరగా అందించి ఇలాంటి వ్యాక్యలు చేయ్యడం దారు ణంగా ఉందన్నారు. ఇక పోతే 2019-24 మద్యలో వైకాపా పాలనలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నవరత్నాలు అనే సంక్షేమం కరోనా కష్టాల్లో కూడా అందించడం జరిగిందన్నారు.ఐదేళ్లు మం చి పాలన అందించిన జగనన్న విద్యాలయాలను దేవాల యాలుగామార్చిన ఘణతచాటుకున్నారని గుర్తు చేశారు. ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించిన కుటుంబం రాజన్నది.. అదేదారిలో ఆరోగ్యశ్రీని ఎంతో ముందుకు తీసుకెళ్లారన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చడంతో జగన్ అంటే నమ్మకం..ఎన్నికల మ్యానిఫెస్టోను అమలు చెయ్య కపోతే బాబుది మోసం అవుతుందని గుర్తు పెట్టుకుని ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలు తప్పకుండా అమలు చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బుట్టా శివనీలకంఠప్ప, రాష్ట్ర వైకాపా యువత విభాగం ఉపాధ్య క్షలు బుట్టా ప్రతుల్, బుట్టా ఎమ్మిగనూరు మండల అధ్యక్షలు బిఆర్ బసిరెడ్డి, ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల మండలాలతో పాటు పట్టణ నాయకులు పాల్గొన్నారు.

# వెల్దుర్తి మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శిగా కె.లక్ష్మీనాథ్

**వెల్దుర్తి,మేజర్ న్యూస్:** మండల కేంద్రమైన వెల్దుర్తి మేజర్ గ్రామపంచాయతీ రెగ్యులర్ కార్యదర్శిగా కె.లక్ష్మీనాథ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. వెల్దుర్తి మేజర్ గ్రామపంచాయతీ ఇంచార్జి కార్యదర్శి యు. గురుస్వామి రెగ్యులర్గా చెరుకులపాడు కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు, పంచాయతీ



కార్యదర్శి యు. గురుస్వామి త్వరలో ప్రమోషన్ పై వెళ్లనున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి కే. లక్ష్మీనాథ్ మాట్లాడుతూ పట్టణంలోనెలకొన్న సమస్యలను గ్రామ ప్రజలు తమ దృష్టికి తీసుకొని వస్తే వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు. పంచాయతీ అధికారికి పట్టణంలోని కొన్ని వార్డులలో పది రోజులకు ఒకసారి త్రాగునీరు రావడం జరుగుతుందని నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆయావార్డు ప్రజలు కోరుతున్నారు. అసలే వర్షాకాలం కాబట్టి మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చెల్లె విధంగా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# ఆళ్లగడ్డలో పబ్లిక్ గ్రీవెన్స్




**ఆళ్లగడ్డ , మేజర్ న్యూస్ :** మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్) కార్యక్రమంలో మండల తహశీల్దార్ జ్యోతి రత్న కుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను ఆమె స్వీకరించారు. 10 మంది లబ్దిదారులు భూ,ఆన్లైన్ సమస్యలపై ఎమ్మార్వోకు వినతి పత్రంసమర్పించారు.అనంతరం నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు. పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. అలాగే ఆళ్లగడ్డ మున్సిపల్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిషోర్ పాల్గొని ప్రజల నుండి వచ్చిన వినతులను స్వీకరించారు.

# 18 సంవత్సరాల లోపు బాల బాలికలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరం

**డోన్ రూరల్ మేజర్ న్యూస్ :** 18 సంవత్సరాలు లోపు బాల, బాలికలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్య నేరమని లేబర్ ఆఫీసర్ శోభారాణి అన్నారు.సోమవారం డోన్ పట్టణంలో బాల కార్మికుల నిర్మూలన పై జిల్లా టాస్కోర్స్ కమిటీ బాల కార్మికుల నిర్మూలన కొరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా డోన్ పట్టణంలో ముఖ్యంగా మెకానిక్ షాపులు ,హెూటల్లు, వెల్డింగ్ షాపులు, బీరువా షాపులో, కార్పెంటర్ షాపులలో జిల్లా టాస్కోర్స్ కమిటీతనిఖీలు చేయడం జరిగింది. అలాగే షాపు ఓనర్లకు చట్టాల పైన అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా బాలలసంరక్షణ విభాగం నుండి సంరక్షణ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎక్కడైనా గాని బాల కార్మికులుగా పనిచేస్తున్నట్లు గుర్తించిన తెలిసిన వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ - 1098 కి కాల్ చేసి తెలపవచ్చు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం




జరుగుతుందనీ అలాగే బాల బాలికలక రక్షణ మరియు సంరక్షణ అవసరమైన పిల్లలు కూడా1098కి కాల్ చేసి చెప్పవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థలు హెచ్ఈఆర్డిఎస్ సంపత్, రాజు మరియు పోలీస్ కానిస్టేబుల్ నాగభూషణం పాల్గొన్నారు.

# గొర్రెల నివాస స్థావరాలను పరిరక్షించండి

**-పిజిఆర్ఎస్లో తహశీల్దార్కు గొర్రెల కాపరుల వినతిపత్రం**

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** గొర్రెల నివాస స్థావరంకోసం కేటాయించిన భూమిని పరిరక్షించాలని సోమవారం మండల తహశీల్దార్,మండల ఎస్ఐలకు వినతిపత్రం అందించారు.ఎన్నో ఏండ్లుగా మండలంలో గొర్రెల నివాస స్థావరం కోసం ప్రభుత్వం ముక్కల గట్టు ప్రాంతాన్ని కేటాయించింది.గతంలో ఈ భూమిలో కొంతమంది అక్రమంగా



**తహశీల్దార్ కు వినతిపత్రం అందిస్తున్న గొర్రెల కాపరులు**

చదును చేసి పంట వేసి ఆక్రమించుకునే ప్రయత్నం చేయగా ఇదే సమస్యపై గర్రెల కాపరులు హైకోర్టును అక్రయించగా కోర్ట్ మండల రెవెన్యూ అధికారులను విచారణ కోరింది. ఈ సమస్య కోర్టులో ఉండగా కోర్ట్ ఆదేశాలను దిక్కరించిన కొంతమంది ఆక్రమించుకొనే ప్రయత్నం చేస్తున్నారు. అందుకు రెవెన్యూ అధికారులు గొర్రెల నివాస స్థావరంకు కేటాయించిన ముక్కల గట్టు భూమిని పరిరక్షించాలని తహశీల్దార్ వెంకటలక్ష్మి,ఎస్ఐ పరమేష్ నాయక్ కు మండల గొర్రెల కాపరులు వినతిపత్రం అందించారు.

# మలేరియా నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**చాగలమర్రి , మేజర్ న్యూస్ :** గ్రామాల్లో మలేరియా నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆళ్లగడ్డ సబ్ యూనిట్ మలేరియా అధికారి శివచంద్రారెడ్డి తెలియజేశారు. మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని కదిరిపురం తాండా గ్రామంలోర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి



**మందును పిచికారీ చేయిస్తున్న వైద్య సిబ్బంది**

ఇంటిలో ఆల్ఫా సైపర్ మైత్రిన్ 5శాతంను పిచికారి చేశారు. మలేరియా రావడానికి కారణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారులు వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, హెల్త్ అసిస్టెంట్ రాముడు,సిహెచ్ఓ వాణి,ఆశా కార్యకర్తలు సునీత,రేష్మ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం,ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం

**తుగ్గలి,మేజర్న్యూస్ :** తుగ్గలి మండలం పరిధిలోని పెండేకల్లు ఆర్ఎస్లో గ్రామంలో తెలుగు యువత నాయకులు చాంద్ భాషా,రఫీ ఆధ్వర్యంలో తల్లికి వందనం నిధులు విడుదల కావడంతోమహిళలు,చిన్నారులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ఫోటోకు పత్తికొండ శాసనసభ్యులు శ్యామ్ కుమార్ ఫోటోలకు సోమవారం



పాలాభిషేకం చేశారు. అదేవిధంగా మహిళలు కేకు కట్ చేసి అభినందనలు తెలుపుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మేనిఫెస్టోలో చెప్పిన విధంగా తల్లికి వందనం పథకం అమలు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. ఎన్నికల ముందు ఏమి వాగ్దానాలు ఇచ్చారో వాటిని అమలు చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. అదేవిధంగా రైతు భరోసా, మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం తదితర అన్నింటిని చేయడం జరుగుతుందన్నారు.ఈ చిన్న రఫీ ,, కార్యక్రమంలో మహిళలు చిన్నారులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎస్ డి ఆర్ ఆకాంక్ష కళాశాల రాయలసీమ కే గర్వకారణం

**-నీట్ లో అల్ ఇండియా ర్యాంకులను సాధించిన విద్యార్థులను అభినందించిన ఎంపీ బైరెడ్డి శబరి**

**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** ఎస్ డి ఆర్ ఆకాంక్ష కళాశాల రాయలసీమకే గర్వకారణమని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.నీట్ 2025 ఫలితాలలో ఆల్ ఇండియా ర్యాంకులను సాధించిన విద్యార్థులకు సోమవారం ఎస్ డి ఆర్ ఆకాంక్ష కళాశాలలో అభినందన సభ నిర్వహించారు ఈ కార్యక్రమానికి నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ ఎస్ డి ఆర్ విద్యాసంస్థల అధినేత శనివారపు కొండారెడ్డి అతి చిన్న వయసులోనే కళాశాలను స్థాపించి జేఈఈ మెయిన్స్ మరియు నీట్ ఫలితాలలో ఎస్డిఆర్ కళాశాల విద్యార్థులు ఆల్ ఇండియా ర్యాంకులు సాధిస్తుండడం చాలా గొప్ప విషయం అన్నారు. ఎస్ డి ఆర్ ఆకాంక్ష కళాశాల విద్యార్థులు గత 5 సంవత్సరాలలోనే దాదాపు 150 కు పైగా మెడికల్ సీట్లు సాధించి రాయలసీమకే గర్వకారణంగా నిలిచారన్నారు. ఇలాంటి అద్భుతమైన ఫలితాలను ప్రతి సంవత్సరం సాధించాలని నంద్యాలను దేశ స్థాయిలో నిలబెట్టాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ తెలిపారు అనంతరం కళాశాల చైర్మన్ శనివారపు




కొండారెడ్డి మాట్లాడుతూ తమ విద్యార్థులకు క్రమశిక్షణ తో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తున్నామని, ప్రతి సంవత్సరం జేఈఈ మెయిన్స్, నీట్ ఫలితాలలో ఆల్ ఇండియా ర్యాంకులు సాధిస్తున్నామని గత ఐదు సంవత్సరాల్లోనే దాదాపు 150 పైగా మెడికల్ సీట్లు సాధించామన్నారు. ఇందుకు కృషి చేసిన అధ్యాపక మరియు అధ్యాపకేతర బృందం నకు చెందిన చైర్మన్ కొండారెడ్డి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ వి ఆర్ ఇంజనీరింగ్ కళాశాలఅధినేత వెంకట్రామిరెడ్డి కళాశాల ప్రిన్సిపాల్,అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పెద్దకడుబూరు మండల ఎఓగా సుచరిత..

**బదిలీ పై వెళ్లిన ఎఓ వరప్రసాద్**

**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** రాష్ట్ర కూటమి ప్రభుత్వం వివిధ కార్యాలయాల్లో ఐదు సంవత్సరాల గా ఒకే చోట పని చేస్తున్న అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనేపథ్యంలో అనంతపురం జిల్లా. ఆత్మకూరు మండలంలో వ్యవసాయాధికారిగాపనిచేస్తున్న సుచరిత సోమవారం పెద్దకడుబూరు మండల వ్యవసాయాదికారిగా వ్యవసాయ కార్యాలయంలో పదవి భాద్యతలు స్వీకరించారు. అలాగే ఇక్కడ పనిచేస్తున్న ఎం. వరప్రసాద్ ను ఇటీవల కోస్గి మండలానికి బదిలీ పై వెళ్లి పోయారు.



**ఎఓ. సుచరిత**

# ప్రభుత్వ పథకాలు అంగన్వాడీలకు అమలు చేయాలి

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** కార్మికుల వేత్తనం పొందుతున్న అంగన్వాడీలకు ప్రభుత్వ పథకాలు అమలు చేయాలనీ సిఐటియు డివిజన్ కార్యదర్శి మోహన్ డిమాండ్ చేశారు.మండలంలో సోమవారం అంగన్వాడీ యూనియన్ నాయకులు మండల తహశీల్దార్ వెంకటలక్ష్మికి వినతిపత్రం అందించి డిమాండ్ చేశారు. ముందుగా సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు తమ డిమాండ్లు పరిష్కరించాలని అదేవిధంగా ప్రభుత్వ పథకాలు తల్లికి వందనం వంటి పథకాలు అమలు చేయాలనీ స్లోగన్ ఇస్తూ ధర్నా చేశారు. అనంతరం మోహన్ మాట్లాడుతూ అంగన్వాడీలు కార్మిక వేత్తనం పొందుతున్నప్పటికీ ప్రభుత్వ పథకాలుఅందడం లేదని, అన్నారు.అంగన్వాడీల కు ప్రభుత్వ పథకాలు అమలుచేసి చిత్త శుద్ధి చాటుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు డివిజన్ కార్యదర్శి మోహన్, అంగన్వాడీ కార్మికులు దస్తగిరమ్మ,స్వర్ణలత,మేరీ, మరియమ్మ, మహేశ్వరీ, పద్మ తదితరులు పాల్గొన్నారు.




**తహశీల్దార్ కు సిఐటియు ఆధ్వర్యంలో వినతిపత్రం అందిస్తున్న అంగన్వాడీలు**

# కృష్ణగిరి తహశీల్దార్ గా ఎస్. ప్రకాష్ బాబు



**కృష్ణగిరి మేజర్న్యూస్ :** కృష్ణగిరి తహశీల్దార్ గా ఎస్. ప్రకాష్ బాబు ను జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా నియమించారు. తహశీల్దార్ గా ఎస్. ప్రకాష్ బాబు సోమవారం భాధ్యతలను స్వీకరించారు. డోన్ నియోజకవర్గం లోని బేతంచెర్ల తహశీల్దార్ గా పని చేస్తున్న ఎస్. ప్రకాష్ బాబును నంద్యాల జిల్లా అధికారులు బదిలీ చేశారు. దాదాపుగా నెలకు పైగా ఇన్ఛార్జీ పాలనలో కోనసాగుతున్న కృష్ణగిరి మండలానికి కృష్ణగిరి తహశీల్దార్ గా ఎస్. ప్రకాష్ బాబును కర్నూలు జిల్లా అధికారులు నియమించారు. ఈ మేరకు ఆయన సోమవారం భాధ్యతలు చేపట్టి విధుల్లో నిమగ్నమైయ్యారు.

## నియోజకవర్గ సంస్థాగత ఎన్నికల నిర్వహణ పై సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుడ్డా

**వెలుగోడు, మేజర్‌న్యూస్ :** మండలంలోని వేల్పనూరు గ్రామం ఎమ్మెల్యే స్వగృహం నందు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి తెలుగుదేశం పార్టీ శ్రీశైలం నియోజకవర్గ సంస్థాగత ఎన్నికల నిర్వహణపై ఆయా మండల పరిశీలకులు, మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అన్ని గ్రామాల ముఖ్య నాయకులతో సమీక్షా సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. శ్రీశైలం మండలం తెలుగుదేశం పార్టీ అబ్జర్వర్, పసల బంగారు, రాము యాదవ్, శ్రీశైలం మండల నాయకులు, కార్యకర్తలు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయ ఢంగా మోగించాలని బూత్ లెవెల్ ఇన్‌చార్జ్‌లు, క్లస్టర్ కన్వీనర్లు తీర్మాణం చేశారు.

## ప్రజా సమస్యలను వేగవంతంగా, నాణ్యతగా పరిష్కరించండి

- నిర్ణీత గడువులోగా అర్జీలను పరిష్కరించండి
- జిల్లా కలెక్టర్ రాజకుమారి

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ధరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి నిర్ణీత గడువులోగా నాణ్యతగా పరిష్కరించాలని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజా పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం పలు అంశాలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డిఆర్ఓ రాము నాయక్, డిప్యూటి కలెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజ కుమారి మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన విజ్ఞప్తులను పరిష్కరించాలని అన్నారు. భూ సర్వేకు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

సంబంధించి 292 ధరఖాస్తులు బియాండ్ ఎస్ఎల్ఏలో ఉన్నాయని సంబంధిత ధరఖాస్తులను గ్రామాల వారిగా గ్రామ సర్వేయర్లకు పంపి వారం రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రెవెన్యూకు సంబంధించి 1131 ధరఖాస్తులు బియాండ్ ఎస్ఎల్ఏలో ఉన్నాయని త్వరగా పరిష్కరించేందుకు ఆర్డీఓలు, తహశీల్దార్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. అదే విధంగా పెండింగ్‌లో ఉన్న ఆడిట్ కేసులను పూర్తి చేయాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న 20 వేల పరిష్కరించిన ఫిర్యాదులపై ఫీడ్‌బ్యాక్‌ను సేకరించాలని తెలిపారు. గ్రామ సచివాలయాల సర్వీసులకు సంబంధించి ఆధార్ ఫీడింగ్ త్వరితగతిన పూర్తి చేయాలని మన మిత్రకు సంబంధించి ఇంకా 11 వేల మందిని నమోదు చేయాలని తెలిపారు. జియో టాగింగ్ సంబంధించి 683 సర్వీసులు పెండింగ్‌లో ఉన్నాయని అదే విధంగా ఈకెవైసి త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. 172 మంది అర్జీదారులు సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌కు వినతిపత్రాలు సమర్పించారు. వీటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు.

## చట్టపరంగా న్యాయం చేస్తాం

- జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** ప్రజా ఫిర్యాదులపై విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తామని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. సోమవారం నగరంలోని కొత్తపేటలో టుటౌన్ పోలీస్‌స్టేషన్ పక్కనున్న ఎస్‌పి క్యాంపు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 93 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పట్ల అలసత్వం ప్రదర్శించవద్దన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించినఫిర్యాదులన్నింటిపై త్వరితగతిన స్పందించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. భాదితుల ఫిర్యాదులలో కొన్ని హైదారబాద్‌లోని ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో నా కుమారుడు జహీర్ బాషాకు ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి రూ.2లక్షల50వేలు తీసుకుని కర్నూలుకు చెందిన శీలం ధరణి మోసం చేసిందని న్యాయం చేయాలని కర్నూలు బి క్యాంపుకు చెందిన ఆశాజహ ఫిర్యాదు చేశారు. రూ.2లక్షల విలువ గల వరి బస్తాలను తీసుకుని డబ్బులు ఇవ్వకుండ ఇబ్బందులకు గురి చేస్తున్న కర్నూలు బుధవారపేటకు చెందిన కృష్ణ స్వామిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కర్నూలు వాసవినగర్‌కు చెందిన వెంకటలక్ష్మి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, సిఐలు తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలకు ఆపదలో ఆపన్నహస్తం ముఖ్యమంత్రి సహాయ నిధి



సహాయ నిధిని అందజేస్తున్న ఎమ్మెల్యే

**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** టీడీపీ కార్యకర్తలు, ఆపదలో ఉన్న ప్రతిఒక్కరికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఆపన్నహస్తం అని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు. పగిడ్యాల మండల కేంద్రానికి చెందిన లక్ష్మీకి వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.2,00,178ల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారు ఇబ్బంది పడకుండా ధైర్యంగా ఉండాలనే ముందు చూపుతో రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వచ్చిన మొత్తాన్ని వారి ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, టీడీపీ మండల కన్వీనర్ మహేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## 19న అభ్యర్థులకు కౌన్సిలింగ్

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలు, జనరల్ హాస్పిటల్స్, ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలకు సంబంధించిన ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయుటకు ఈ నెల 19న కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 20-11-2023న జారీ చేసిన నోటిఫికేషన్‌కు సంబంధించి 10 కేటగిరిలలో అభ్యర్థుల ఫైనల్ మెరిట్ లిస్ట్, సెలక్షన్ లిస్ట్‌లను జిల్లా కలెక్టర్ ఆమోదంతో కర్నూలు, నంద్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీల వెబ్‌సైట్‌లలో ఉంచడం జరిగిందన్నారు. ఎంపికైన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికేట్స్, రెండు సెట్ల నకల్ సర్టిఫికేట్లతో ఈ నెల 19న ఉదయం 10.30గంటలకు కర్నూలు మెడికల్ కాలేజ్ కార్యాలయంలో కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని, హాజరు కాని యడల అభ్యర్థుల ఎంపిక రద్దు చేయబడుతుందని వారు తెలిపారు.

## డ్రంక్‌అండ్ డ్రైవ్‌లో 11మందికి జరిమాన

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** డ్రంక్‌అండ్‌డ్రైవ్‌లో పట్టుబడిన 11మందికి కర్నూలు జెఎఫ్‌సిఎం కోర్టు జడ్జి ఒక్కొక్కరికి రూ.11వేలు జరిమానా విధించినట్లు కర్నూలు ట్రాఫిక్ సిఐ మన్సూరుద్దీన్ తెలిపారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఉత్తర్వుల మేరకు ట్రాఫిక్ సిబ్బంది ప్రతిరోజు డ్రంక్‌అండ్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డ్రంక్‌అండ్‌డ్రైవ్‌లో పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి వారిని సోమవారం జెఎఫ్‌సిఎం కోర్టులో హాజరు పరిచామన్నారు. జెఎఫ్‌సిఎం కోర్టు జడ్జి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున మొత్తం రూ.1లక్ష10వేలు జరిమానా విధించినట్లు సిఐ తెలిపారు.



డ్రంక్‌అండ్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ వారిని కోర్టుకు హాజరు పరిచిన ట్రాఫిక్ పోలీస్

## అభివృద్ధి పై సవాల్‌కు సిద్ధం

- మీ ఇంటికి జిల్లా స్థాయి గుర్తింపు తెచ్చిందే రాంపురంరెడ్డి సోదరులు
- అభివృద్ధిపై ఎక్కడికెళ్లిన చర్చకు సిద్ధం
- తెలుగుదేశం పార్టీ నాయకులకు వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సవాల్

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** మంత్రాలయంనియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు రాఘవేంద్రరెడ్డి మా కుటుంబ సభ్యులు వెన్నుపోటు రాజకీయాలు చేశారని పేర్కొనడం హాస్యాస్పదమని వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మంత్రాల యం మండల పరిధిలోని రాంపురంలోని భీమా నిలయం నందు నియోజకవర్గ నాయకులతో కలిసి జిల్లా ఉపా,ధ్యక్షులు ప్రదీప్‌రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహిం చాఉ. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ నాయకులు రాఘవేంద్రరెడ్డి వెన్నుపోటు రాజకీయాలు, అభివృద్ధి పనులపై చేసిన సవాల్‌ను స్వీకరిస్తామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి సాధారణ నిధులే తప్ప తమ కూటమి ప్రభుత్వంను ఒప్పించి ప్రత్యేక నిధులు తెచ్చిందేమి లేదని బడాయి మాటలు ఆపి అభివృద్ధిపై దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు

పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. మీ ఇంటికి గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయిలో గుర్తింపు తెచ్చింది ఒక్క రాంపురంరెడ్డి సోదరులేని, ప్రజల ఆశీస్సులు ఎమ్మెల్యేగా రాంపురంరెడ్డి సోదరులే గెలుస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. వంద ఎకరాల భూములను మురళీమోహన్ రెడ్డి కబ్జా చేశారన్న వ్యవహారంపై న్యాయ, రెవిన్యూ విచారణలో మాది తప్పిదం అని తేలితే మురళీరెడ్డి పేరు మీద ఉన్న ఎకరం భూమి తిరిగి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

ఈకార్యక్ర మంలో వైఎస్సార్సిపి జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తంరెడ్డి, భీమా రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, గజేంద్ర రెడ్డి, శివరాంరెడ్డి, బెట్టనగౌడ్, నరసన్న, నరసింహులు గౌడ్, ప్రహ్లాదాచార్, అమరేష్, బుజ్జిస్వామి, ఏకాంబరెడ్డి, మాబుసాబ్, తదితరులు పాల్గొన్నారు.

## నీట్‌లో ర్యాంకు సాధించిన విద్యార్థికి అభినందనలు

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** నీట్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచి ఆల్ ఇండియా 181వ ర్యాంకు సాధించిన కొండ సతీష్ చంద్ర రాయల్‌కు టిటిడి బోర్డు మెంబర్ మల్లెల రాజశేఖర్, తూర్పు సంఘం గౌరవ అధ్యక్షురాలు విజయభారతిలు సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓర్వకల్లు మండలం హుస్సేనాపురం గ్రామానికి చెందిన వెంకటసుబ్బన్న, నాగశిరోమణిల కుమారుడు నీట్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మండలానికి, గ్రామానికి, వారి తల్లిదండ్రులకు గుర్తింపు తీసుకొచ్చాడన్నారు. తండ్రి వ్యవసాయం చేస్తూ తల్లి ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తుందని తల్లిదండ్రులు తమ కుమారుడిని డాక్టర్‌గా చూడాలనే కళ నెరవేర్చడం సంతోషించదగ్గ విషయమన్నారు. తమ కుమారుడిని అందరు ఆశీర్వదిస్తుంటే తల్లిదండ్రులు ఆనందంతో పరవశించిపోయారు.



విద్యార్థికి స్వీట్ తినిపిస్తున్న మల్లెల రాజశేఖర్